ఆంధ్రజ్యోతి



కందిని దెబ్బకొట్టిన
వరుస తుఫాన్లు
- పైర్లు పెరిగినా.. ప్రయోజనం శూన్యం
- రాలిపోయిన పూత
- దిగుబడిపై తీవ్ర ప్రభావం

(వివరాలు 7లో...)

నేడు క్రిస్మస్


పెనుకొండలో క్రిస్మస్ ట్రీ

ముస్తాబైన చర్చిలు

హిందూపురం అర్బన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): క్రైస్తవుల పవిత్ర పర్వదినం క్రిస్మస్‌కు చర్చిలు ముస్తాబయ్యాయి. బుధవారం పండుగను ఘనంగా చేసుకునేందుకు క్రైస్తవులు ఏర్పాట్లు చేసుకున్నారు. చర్చిలను విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. క్రిస్మస్ ట్రీ, ఆట బొమ్మలు తదితరాలను ఏర్పాటు చేశారు. బుధవారం నిర్వహించే ప్రార్థనలు, పాటలు రాయలసీమకే తలమానికంగా నిలిచిన హిందూపురంలోని అతి పెద్ద సీఅండ్‌ఐజీ మిషన్ సిలోన్ చర్చి విద్యుత్ వెలుగుల్లో దగదగా మెరిసిపోతోంది. విద్యానగర్‌లోని జెరూసలేం సెంట్రల్ చర్చి సర్వాంగసుందరంగా ముస్తాబైంది. జిల్లావ్యాప్తంగా కదిరి, ధర్మవరం, పుట్టపర్తి, కొత్తచెరువు, పెనుకొండ, గోరంట్లతోపాటు అన్ని మండల కేంద్రాల్లోని చర్చిల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.


విద్యుద్దీప వెలుగుల్లో హిందూపురంలోని సీఅండ్‌ఐజీ మిషన్ చర్చి



హిందూపురంలో ముస్తాబైన చర్చి, అనంతపురంలోని కార్మెల్ మాత చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న ఎస్పీ రత్న



అలరించిన సంగీత కచేరి

పుట్టపర్తి(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో క్రిస్మస్ వేడుకల్లో భాగంగా మంగళవారం సాయంత్రం విదేశీ భక్తుల సంగీత కచేరి అలరించింది. విదేశీయులు భక్తిపాటలు ఆలపించారు. క్రిస్మస్ కోయర్స్ పేరిట సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. బుధవారం ప్రశాంతి నిలయంలో క్రిస్మస్ వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. వేడుకల్లో పాల్గొనడానికి దేశవిదేశీ భక్తులు ప్రశాంతి నిలయానికి చేరుకున్నారు.


పాటలు పాడుతున్న విదేశీభక్తులు

రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ టీఎస్ చేతన్.. పాలీహౌస్‌లో సాగుచేస్తున్న రోజా పంట పరిశీలన


పాలీహౌస్‌లో రోజా పంట సాగు వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ చేతన్

చిలమత్తూరు, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకుని, మంచి ఫలితాలు సాధించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సూచించారు. కొడికొండ సమీపాన రైతు అజీముల్లా పాలీహౌస్‌లో రోజా పంటను మంగళవారం పరిశీలించారు. సాగు వివరాలు, లాభాల గురించి రైతును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా అందించిన రాయితీతో పాలీహౌస్ నిర్మించుకున్నానని రైతు అజీముల్లా కలెక్టర్‌కు తెలిపారు. అందులో 30 వేల మొక్కలు నాటానని వివరించారు. పూలను రోజూ కోసి బెంగళూరుతోపాటు ఇతర దేశాలకు కూడా ఎగుమతి చేస్తున్నామన్నారు. ఈ పాలీహౌస్ ద్వారా పది మందికి రోజూ ఉపాధి కల్పిస్తున్నామని, సాగు లాభదాయకంగా ఉందని అన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయంలో కొత్త పద్ధతులను అవలంబిస్తూ అధిక దిగుబడులు పొందాలన్నారు. పాలీహౌస్‌లో కూరగాయలు, పూల తోటల సాగు లాభదాయకంగా ఉంటుందన్నారు. నాణ్యమైన పంట దిగుబడులు పొందవచ్చాన్నారు. పాలీహౌస్‌లో సాగుచేసే పంటలకు మార్కెట్లో ఎక్కువ గిరాకీతోపాటు అధిక ధరలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖాధికారి చంద్రశేఖర్, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్ పాల్గొన్నారు.


301 సెల్‌ఫోన్ల రికవరీ

పుట్టపర్తి టౌన్, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత మూడునెలల్లో వివిధ ప్రాంతాల్లో చోరీ అయిన, పోగొట్టుకున్న 301 సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. వాటిని ఎస్పీ రత్న మంగళవారం స్థానిక తన కార్యాలయంలో సంబంధికులకు అప్పగించారు. వాటి విలువ రూ.40లక్షలు ఉంటుందని ఎస్పీ తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. సెల్‌ఫోన్ పోగొట్టుకున్నా, చోరీ అయినా వెంటనే పోలీసు హెల్ప్‌లైన్ నంబరు 6305800426 నంబరుకుగానీ, సీఈఐఆర్ వైబ్‌సైట్‌లోగానీ ఫిర్యాదు చేయాలన్నారు. సెల్‌ఫోన్ల రికవరీలో చొరవ చూపిన స్పెషల్ బ్రాంచ్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డీఎస్పీ విజయకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


సెల్‌ఫోన్లను సంబంధికులకు అప్పగిస్తున్న ఎస్పీ రత్న

గజ గజ

వరుస తుఫాన్ల ప్రభావంతో పడిపోతున్న ఉష్ణోగ్రతలు



విపరీతంగా పెరిగిన చలిగాలులు

విజృంభిస్తున్న రోగాలు.. బెంబేలెత్తుతున్న ప్రజలు

కొత్తచెరువు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): చలితీవ్రత రోజురోజుకీ పెరుగుతుండడంతో జనం గజగజ వణికిపోతున్నారు. రెండు నెలలుగా వరుస తుఫాన్ల ప్రభావంతో వాతావరణంలో విపరీతమైన మార్పులు వచ్చాయి. దీంతో జిల్లావ్యాప్తంగా ఉష్ణోగ్రతలు రోజురోజుకీ పడిపోతున్నాయి. చలి వణికిస్తోంది. చలిగాలులు జనాన్ని కలవర పెడుతున్నాయి. తెల్లవారుజామున పొగమంచుతో కూడిన చలిగాలులు జనాలను బెంబేలెత్తిస్తున్నాయి. ఉదయం 9 గంటలు దాటినా పొగమంచు తొలగడంలేదు. దీంతో ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జనం జంకుతున్నారు. పగలు, రాత్రి ఉష్ణోగ్రతల్లో భారీ వ్యత్యాసం ఉంటుండడంతో అన్ని వయసుల వారు అనారోగ్యం బారిన పడుతున్నారు. చలిగాలులకు జలుబు, దగ్గుతో మెదలై విష జ్వరాలు వ్యాపిస్తున్నాయి. ఆస్తమా, గుండె సంబంధిత రోగులకు ఊపిరి ఆడకుండా చేస్తున్నాయి. దీంతో ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. వాతావరణ మార్పుల కారణంగా పంటలకు చీడపీడలు అధికంగా సోకుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉదయం పూట పొలాల వద్దకు వెళ్లాలంటే చలి, పొగమంచుతో విలవిల్లాడుతున్నామని వారు వాపోతున్నారు.



వామ్మో.. నిమోనియా..



శీతాకాలం వచ్చిందంటే చాలు ఆస్తమా, అలర్జీ పీడితుల అవస్థలు వర్ణనాతీతం. చలిగాలికి జ్వరాలతోపాటు అలర్జీ సమస్యలు తీవ్రమవుతాయి. చాలామంది చిన్నారులు నిమోనియా బారిన పడుతున్నారు. వైరల్ ఇన్ఫెక్షన్‌తో ఒకరి నుంచి మరొకరికి సోకుతుండడంతో జనాలు జ్వరాల బారిన పడుతూ ఆందోళన చెందుతున్నారు. దీంతో ప్రతి ఇంట్లో జ్వరబాధితులు కనిపిస్తున్నారు.


కొత్తచెరువు సమీపంలో కప్పేసిన పొగమంచు


మడకశిరలో చలిమంట కాచుకుంటున్న ప్రజలు


బత్తలపల్లి వద్ద జాతీయ రహదారిపై దట్టంగా కమ్ముకున్న పొగమంచు

రహదారులను కమ్మేస్తున్న పొగమంచు

చలి తీవ్రతకుతోడు తెల్లవారుజామున దట్టమైన పొగమంచు కురుస్తోంది. రహదారులను కమ్మేస్తోంది. దీంతో వాహనదారులు నానాపాట్లు పడుతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వివిధ పనులకు వెళ్లే జనం, ఉద్యోగులు ఉదయం పూట ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మరింత అప్రమత్తంగా ఉండాలి

వాతావరణ మార్పుల కారణంగా జబ్బులు సోకే ప్రమాదం ఉంది. ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలి. దీర్ఘకాలిక జబ్బులు, ఆస్తమా పీడితులు చల్లని వాతావరణం, పదార్థాలకు దూరంగా ఉండాలి. వేడి ఆహార పదార్థాలను మాత్రమే తీసుకోవాలి. చలిగాలికి చర్మం పగుళ్లు వచ్చే అవకాశం ఉంది. జలుబు, దగ్గు ఉన్నవారు వేడినీరు తాగడం మంచిది. ఉదయం, రాత్రి వేళల్లో ప్రయాణాలు మానుకోవాలి.

- అశ్వత్థకుమార్, వైద్యాధికారి, కొత్తచెరువు సీహెచ్‌సీ

పేదల ఆశలపై నీళ్లు!


కదిరిలో టిడ్కో ఇల్లు



టిడ్కో ఇళ్లపై వైసీపీ కక్ష రాజకీయం

ఐదేళ్లూ ఎక్కడి నిర్మాణాలు అక్కడే..!

నష్టపోయిన లబ్ధిదారులు



పుట్టపర్తి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సొంతిల్లు ప్రతి ఒక్కరి కల. పట్టణాల్లో గూడు లేని అభాగ్యులకు సొంతింటి కలను నెరవేర్చుకోవడం జీవితాశయం కూడా. అటు వంటి వారికి పట్టణ మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి సంస్థ (టిడ్కో) ద్వారా ఇళ్లను నిర్మించి ఇవ్వాలని గత టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. 2018లో పురపాలక సంఘాల పరిధిలో 4176 టిడ్కో గృహ సముదాయాలు నిర్మించాలని సంకల్పించింది. 2019 నాటికి 80శాతం పనులను కూడా పూర్తి చేసింది. అదే ఏడాది నిర్వహించిన సాధారణ ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. రివర్స్ టెండరింగ్ పేరుతో వైసీపీ ప్రభుత్వం పేదల ఇళ్లపై కక్షగట్టింది. ఐదేళ్లూ కాలయాపన చేసింది. ఒక్కపని కూడా మొదలు పెట్టలేదు. జిల్లాలో లబ్ధిదారులకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదు. సొంతింటి కల నెలవేరుతుందన్న ఆశతో టిడ్కో గృహం కోసం కొందరు కూడబెట్టిన సొమ్ము, మరికొందరు అప్పు చేసి లబ్ధిదారుల వాటా కింద డీడీలు చెల్లించారు. వైసీపీ ప్రభుత్వం వారి ఆశలపై నీళ్లు చల్లింది. అదిగో.. ఇదిగో.. అంటూ కాలయాపన చేసిందే తప్ప.. ఇల్లు ఇవ్వలేదు. ఐదేళ్లపాటు లబ్ధిదారులు వేచిచూసినా ఫలితం దక్కలేదు. పోనీ కట్టిన మొత్తమైనా తిరిగి ఇవ్వాలని కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేసినా ప్రయోజనం లేదు. టిడ్కో గృహసముదాయాల వద్ద రహదారులు, కాలువలు, తాగునీటి సరఫరా తదితర మౌలిక వసతులు కల్పించలేదు. పైగా టిడ్కో ఇళ్ల సముదాయాల వద్ద ఇనుప కడ్డీలతోపాటు లోపల చాలా చోట్ల దుండగులు ధ్వంసం చేశారు. సామగ్రిని సైతం ఎత్తుకెళ్లారు. ఎన్నికలకు ముందు గత ప్రభుత్వం టిడ్కో ఇళ్లకు రంగులు వేసి, హడావుడి చేసింది. పనులు పూర్తిచేసింది లేదు, లబ్ధిదారులకు అందించిందీ లేదు. ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓడిపోయి, కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి, అప్పగించాలని ప్రభుత్వం భావిస్తుండడంతో లబ్ధిదారులు సంబర పడుతున్నారు.


పుట్టపర్తిలోని టిడ్కో ఇంట్లో దుస్థితి

వేసింది.. రంగులే..

ధర్మవరంలో టిడ్కో ఇళ్ల సముదాయంలో గత టీడీపీ హయాంలో 1440 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. 90శాతం పనులు పూర్తి చేశారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో రోడ్లు, ఇళ్లకు తలుపులు, రంగులు మార్చడమే తప్ప.. మౌలిక సదుపాయాలేవీ కల్పించలేకపోయింది. అప్పట్లో ఇళ్లు పొందిన లబ్ధిదారుల్లో కొందరిని మార్చేశారు. ఎన్నికల ముందు వైసీపీ పాలకులు హడావుడిగా లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు అప్పగించారు. విద్యుత్, నీటి సరఫరా కూడా లేదు. పెండింగ్ పనులు పూర్తి చేస్తే ఇళ్లలో నివాసం ఉండేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపుతున్నారు.


ధర్మవరంలో టిడ్కో ఇళ్లకు వేసిన వైసీపీ రంగులు

ఐదేళ్లూ అంతే..

కదిరిలో 1104, హిందూపురంలో 1200 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. గత టీడీపీ హయాంలోనే 80శాతం పనులు పూర్తి చేశారు. పుట్టపర్తిలో 432 ఇళ్లు 70శాతం పనులు పూర్తయ్యాయి. హిందూపురంలో పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో నిర్మాణం చేపట్టారు. గదులకు రంగులు, తలుపులు, కిటికీలు, ఫ్లోరింగ్ పనులతోపాటు మౌలిక సదుపాయాలైన విద్యుత్, తాగునీరు, రోడ్లు వేయాల్సి ఉంది. ఐదేళ్లూ వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోడంతో ఇనుప కడ్డీలను కోసుకుని, దుండగులు ఎత్తుకెళ్లారు. ఇళ్ల లోపలు ధ్వంసం చేశారు. మిగిలిన 20 శాతం పనులు పూర్తి చేస్తే వినియోగంలోకి తీసుకురావచ్చునని అధికార యంత్రాంగం చెబుతోంది.



హిందూపురం, ధర్మవరంలో టిడ్కో ఇళ్లలో దుస్థితి



కుంగిపోయిన బ్రిడ్జి

కుంగిన హగరి వంతెన

బొమ్మనహాళ్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కళ్లదేవనహళ్లి-బండూరు గ్రామాల మధ్య వేదవతి హగరి నదిపై వంతెన కుంగిపోయింది. భారీ వాహనాల రాకపోకలతో కూలేపోయే దశకు చేరుకుంది. వంతెనపై డివైడర్ మంగళవారం అకస్మాత్తుగా పక్కన కుంగి రెండుభాగాలుగా విడిపోయాయి. ఏ క్షణంలోనైనా ప్రమాదం జరగవచ్చని కళ్లదేవనహళ్లి, బండూరు, గోవిందవాడ, కళ్లహోళ తదితర గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ బ్రిడ్జిని 40 ఏళ్ల క్రితం నిర్మించారని స్థానికులు అంటున్నారు. బొమ్మనహాళ్ మండలం నుంచి ఉరవకొండ, గుంతకల్లు ప్రాంతాలకు వెళ్లేందుకు ఈ వంతెనే ఆధారం. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని వంతెనను నిర్మించేలా చూడాలని కోరుతున్నారు.



ఇటీవల పోలీసులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

సరిహద్దు దాటుతున్న ఇసుక

యాడికి మండలం మీదుగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. చీకటి పడగానే గుట్టు చప్పుడు కాకుండా సరిహద్దులు దాటుతోంది. పెద్దపప్పూరు, తాడిపత్రి రూరల్ మండలాల నుంచి ఇసుకను రాత్రి 8 నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకూ అక్రమంగా తరలిస్తున్నారు. రాయలచెరువు, చందన, దైవాలమడుగు గ్రామాల మీదుగా నంద్యాల జిల్లాకు తరలిస్తున్నారని సమాచారం. పోలీసుల తనిఖీల సమయంలో.. కళ్లు కప్పేందుకు ఇసుక లోడుతో ఉన్న ట్రాక్టర్లను పొలాలు, వంకల్లో ఆపుతున్నారు. పోలీసులు వెళ్లిపోయాక రవాణా చేస్తున్నారు. తనిఖీల్లో పట్టుబడిన వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్ వద్ద పెడుతున్నారు. ఇసుక అక్రమ రవాణాదారులకు పోలీసు తనిఖీల సమాచారం ముందుగానే తెలుస్తోందని, అందుకే దొరక్కుండా తప్పించుకుంటున్నారని సమాచారం.

- ఆంధ్రజ్యోతి, యాడికి

న్యూస్‌బాక్స్

27న విచారణకు రండి

డీఎంహెచ్ఓకు పిలుపు

అనంతపురం టౌన్, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): డీఎంహెచ్ఓ డాక్టరు ఈ.బీ. దేవిపై ఓ సబ్‌యూనిట్ అధికారి ఇచ్చిన ఫిర్యాదులపై విచారణకు జిల్లా అధికారులు సిద్ధమయ్యారు. డీఆర్ఓ మలోల విచారణ చేపడుతున్నారు. ఈనెల 27న హాజరు కావాలని డీఎంహెచ్ఓకు సమాచారం పంపారు.

టమోటా కిలో రూ.13

అనంతపురం రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 13తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు మంగళవా రం 1650 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 9, కనిష్ఠ ధర రూ. 5 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.28వేలు

అనంతపురం రూరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 28,310 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 12వేలు, సరాసరి రూ. 19వేలుతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 18 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ఫైన్‌తో ఫీజు చెల్లించండి

అనంతపురం విద్య, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి-2025 పరీక్షలకు ఈ నెల 27వ తేదీ నుంచి రూ. 1000 ఫీజు చెల్లించవచ్చని డీఈఓ ప్రసాద్‌బాబు, ఏసీ గోవింద్ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 27వ తేదీ నుంచి జనవరి 10వ తేదీ వరకూ ఫీజు చెల్లించే అవకాశం ఉందన్నారు. ఇప్పటి వరకూ ఫీజు కట్టని విద్యార్థులు ఫీజు చెల్లించేలా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

'కందుల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి'

ఉరవకొండ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కందుల కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి డిమాండ్ చేశారు. వజ్రకరూరు మండలం కొనకొండ్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేయడం తగదన్నారు. ఖరీఫ్ సీజన్‌లో అత్యధికంగా కంది పంటను సాగు చేశారన్నారు. పండించిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేయడానికి ప్రభుత్వం ముందుకు రాకపోవడంతో రైతులు దళారులకు అమ్ముతున్నారన్నారు. ఇదే అదునుగా దళారులు తక్కువ రేటుకు కొనుగోలు చేసి రైతులను మోసం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

వెబ్‌సైట్‌లో పరీక్షల ఫైనల్ కీ

అనంతపురం విద్య, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపకార వేతన పరీక్షల (ఎన్ఎంఎంఎస్) ఫైనల్ కీ డీజీఈ కార్యాలయ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. డీజీఈ కార్యాలయ వెబ్‌సైట్ www.bse.ap.gov.inలో ఉంచారన్నారు. విద్యార్థులు పరిశీలించాలని సూచించారు.

27న విజయవాడలో రాష్ట్రస్థాయి వాలీబాల్ ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శాప్ ఆధ్వర్యంలో ఈనెల 27న విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్రస్థాయి సీనియర్ వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పురుషులు, మహిళలు వారి జనన, ఆధార్‌కార్డు, నివాసధృవీకరణ పత్రాలతో ఉదయం 7గంటలకు హాజరుకావాలని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు రాజస్థాన్‌లోని జైపూర్‌లో నిర్వహించే జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. వివరాలకు సెల్ నంబరు 9381747940ను సంప్రదించాలని కోరారు.

ఎల్ఎల్‌సీ ఈఈగా నారాయణనాయక్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): టీబీ డ్యాం పరిధిలోని ఎల్ఎల్‌సీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)గా నారాయణనాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర జలవనరులశాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని మైనర్ ఇరిగేషన్ ధర్మవరం డివిజన్ ఈఈగా పని చేస్తున్న నారాయణనాయక్‌ను టీబీ డ్యాం పరిధిలోని బళ్లారి సర్కిల్ ఎల్ఎల్‌సీ (లో లెవెల్ కెనాల్) ఈఈగా బదిలీ చేశారు. ఇక హెచ్చెల్సీలోని ధర్మవరం బ్రాంచ్ కెనాల్ ఈఈగా ఉన్న అబ్దుస్ సమీకి మైనర్ ఇరిగేషన్ ధర్మవరం డివిజన్ ఈఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

పార్టీ విస్తరణకు కృషి చేయాలి



ప్రసంగిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



హాజరైన నాయకులు, కార్యకర్తలు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యలపై పోరాటాలు సాగిస్తూనే పార్టీ విస్తరణకు కృషి చేయాలని సీపీఎం నాయకులు, కార్యకర్తలకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. నగరంలోని ఎస్ఎస్ గ్రాండ్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం నుంచి నిర్వహిస్తున్న సీపీఎం జిల్లా 14వ మహాసభలు మంగళవారం సాయంత్రం ముగిసాయి. మహాసభల్లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుతోపాటు కార్యదర్శివర్గ సభ్యుడు వెంకటేశ్వరరావు పరిశీలకులుగా వ్యవహరించారు. రెండురోజుల పాటు పార్టీకి సంబంధించిన వివిధ అంశాలపై జరిగిన చర్చలను వారు పరిశీలించారు. గడిచిన మూడేళ్లలో పార్టీ చేపట్టిన కార్యక్రమాలపై నాయకులు, కార్యకర్తలతో చర్చించడంతోపాటు భవిష్యత్ కార్యాచరణను రూపొందించారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో మతతత్వ ప్రమాదం మరింతగా ముంచుకొస్తోందన్నారు. బీజేపీ తెస్తున్న మత విభజన రాజకీయాలను తిప్పికొట్టి, ఐక్యతను తీసుకొచ్చే కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో జరపాలన్నారు. అధికార టీడీపీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలేదని విమర్శించారు. ప్రజలపై అధిక విద్యుత్ భారాలు మోపుతోందన్నారు. వీటిపై దృష్టి సారించి పోరాటాలు రూపొందించాల్సిన అవసరముందన్నారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గడిచిన మూడేళ్లలో సీపీఎం అనేక కార్యక్రమాలు రూపొందించిందన్నారు. అనంతరం 26 మందితో సీపీఎం జిల్లా నూతన కమిటీ, 9 మందితో కార్యదర్శివర్గం ఎన్నికను నిర్వహించారు. అనంతరం పామిడికి చెందిన అనిమిరెడ్డిని రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, గార్లదిన్నెకు చెందిన నాగమ్మను రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వెంకటేశ్వరరావు సన్మానించారు.

సంక్షేమ పథకాల్లో కోత పెడితే సహించం

అనంతపురం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల్లో కోత పెడితే సహించేది లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనర్హుల గుర్తింపు పేరుతో జరుగుతున్న సర్వేను ఆయన తప్పుబట్టారు. అనంతపురం జిల్లా కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బడ్జెట్‌ను మిగిల్చే క్రమంలో సర్వే పేరుతో అనర్హుల గుర్తింపు కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. జాబితాను పార్టీలపరంగా గుర్తించి, రాజకీయ వేధింపులకు ఉపయోగించుకునే అవకాశాలు లేకపోలేదని అనుమానం వ్యక్త చేశారు. వైసీపీ ప్రభుత్వం ఇదే రకమైన చర్యలకు పాల్పడిందని అన్నారు. సర్వే పేరుతో కుటుంబ సమాచారాన్ని సేకరించి బయట కంపెనీలకు అప్పగించే ప్రమాదం ఉందని అన్నారు. వైసీపీ ప్రభుత్వం తరహాలో సర్వే పేరుతో డేటా సేకరించి ప్రైవేట్ సంస్థలకు అప్పగించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. అందుకే తాము డేటా ప్రైవసీ యాక్ట్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. అమెరికా, యూకే ఎన్నికల్లో కూడా ఈ రకమైన డేటా ప్రభావితం చేసిందని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు డేటాను సంరక్షించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం దొడ్డిదారిన వ్యవసాయరంగాన్ని ప్రైవేట్‌పరం చేయాలని చూస్తోందని ఆరోపించారు. రైతులు పోరాటం చేసి తిప్పికొట్టిన మూడు వ్యవసాయ చట్టాలను దొడ్డిదారిన అగ్రికల్చర్ మార్కెటింగ్ రీఫార్మ్స్ పేరుతో దేశంలో అమలు చేయాలని చూస్తోందని అన్నారు. చట్టంతో పనిలేకుండా, రాష్ట్ర ప్రభుత్వాల ఆమోదంతో దొడ్డిదారిన అమలు చేయించే ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయని అన్నారు. ఏపీ ప్రభుత్వం దీన్ని వ్యతిరేకించాలని కోరారు. రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ పట్ల కేంద్ర హోంమంత్రి చేసిన అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని తమ పార్టీ డిమాండ్ చేస్తోందని అన్నారు. కేంద్ర హోంమంత్రి వ్యాఖ్యలను నిరసిస్తూ ఈ నెల 30న దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సీపీఎం నిర్ణయించిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నడూ లేనివిధంగా ట్రూ అప్ ఛార్జీల పేరుతో రూ.16 వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపిందని అన్నారు. స్మార్ట్ మీటర్లు పెడితే ధ్వంసం చేయాలని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నారా లోకేశ్ చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన మాటను నిలబెట్టుకోకుండా యధావిధిగా అమలు చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారాన్ని తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు.

చేపా..చేపా!

ఎందుకు పెరగవ్?

నిర్వీర్యమవుతున్న పీఏబీఆర్ మత్స్యక్షేత్రం

109 చేపల పాండ్లలో...

వినియోగంలో ఉన్నది 37

తగ్గిపోతున్న చేపపిల్లల పెంపకం

పోస్టులన్నీ ఖాళీ.. భర్తీ చేసే నాథుడే లేడు

ఇదీ పీఏబీఆర్ మత్స్యక్షేత్రం దుస్థితి

> అనగనగా ఓ చేప. ఎన్నాళ్లున్నా అది ఒకటే ఉంటోంది. దాని సంతానం పెరగడంలేదు. ఎందుకిలా అని యోచించి దాని వద్దకెళ్లి ఎందుకు పెరగడం లేదని ప్రశ్నిస్తే దాని గోడంతా వెళ్లబోసుకుంది. దాని గోడంతా మీకోసం..



పీఏబీఆర్ మత్స్యక్షేత్రం

అనంతపురం ప్రెస్‌క్లబ్/కూడేరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మత్స్యసంపదను వృద్ధిచేసేందుకు ఏర్పాటుచేసిన మత్స్యక్షేత్రాల్లో పీఏబీఆర్ క్షేత్రమే పెద్దది. ఇక్కడ పక్కనే పెద్ద జలాశయముంది. ఎప్పటికీ నీరు సమృద్ధిగా ఉంటుంది. కావలసినంత స్థలం ఉంది. చేపల పెంపకానికి 109 చేపల పాండ్లున్నాయి. అయినా చేపల పెంపకం మాత్రం జరగడంలేదు. ఎక్కడా చూసినా ముళ్ల కంపలు... చెత్తాచెదారం, నెర్రెలు చీలిన పాండ్లు దర్శనమిస్తున్నాయి. సరైన పర్యవేక్షణ, మౌలిక వసతులు, మెయింటెనెన్స్ లేకపోవడంతో ఆ క్షేత్రం శిథిలావస్థకు చేరుకుంటోంది. పాండ్లన్నీ నిర్వీర్యమైపోవడంతో చేపపిల్లల పెంపకం ఏడాదికేడాది తగ్గుతూ వస్తోంది.

37 మాత్రమే వినియోగంలో..

ఈ క్షేత్రంలో దాదాపు నూట తొమ్మిది పాండ్లు ఉన్నాయి. అయితే వీటి ఆలనాపాలనా చూసుకునే వారు లేకపోవడంతో అవి ఒక్కొక్కటి శిథిలమవుతూ వస్తున్నాయి. ఇప్పటికే దాదాపు 72 పాండ్లు శిథిలమయ్యాయి. ప్రస్తుతం అక్కడ 37 పాండ్లు మాత్రమే వినియోగంలో ఉన్నాయి. దీంతో కోట్లలో చేపల పిల్లల పెంపకం జరగాల్సిన ఈ క్షేత్రంలో 80 లక్షల చేపపిల్లలు మాత్రమే పెంపకం చేపడుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. అయితే విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు అక్కడ కేవలం 10 లక్షల చేపపిల్లల పెంపకం మాత్రమే జరుగుతున్నట్లు తెలుస్తోంది.



అతి తక్కువ చేపపిల్లల పెంపకం చేపడుతున్న పాండ్లు ఇవే

ఏళ్లుగా సిబ్బంది కొరత...

పీఏబీఆర్ మత్స్యక్షేత్రంలో సరైన సిబ్బంది లేకపోవడంతో సమస్య తీవ్రతరమవుతోంది. ఇక్కడ ఎఫ్‌డీఓ అధికారితో పాటు ఒక ఫీల్డ్ మెన్, నలుగురు షిఫర్‌మ్యాన్‌లు, ఒక వాచ్‌మెన్ ఉండాలి. అయితే అయా పోస్టుల్లో ఉన్న సిబ్బంది పదవీ విరమణ చేయడంతో ఆ పోస్టులు ఖాళీ ఏర్పడ్డాయి. అయితే ఆ ఖాళీలను భర్తీ చేయకపోవడంతో పర్యవేక్షణ సమస్య ఏర్పడుతోంది. ప్రస్తుతం ఇక్కడ రెగ్యులర్ ఎఫ్‌డీఓ లేకపోవడంతో ఇన్‌చార్జ్ ఎఫ్‌డీఓ ఉన్నారు. ఒక ఫీల్డ్ మెన్, ఒక షిషర్‌మ్యాన్ మాత్రమే ఉన్నారు. ఉండాల్సిన ఒక వాచ్‌మెన్ లేకపోవడంతో భద్రతా సమస్య తలెత్తుతోంది. ఆ క్షేత్రంలోకి ఎవరొస్తున్నారో... ఎవరు వెళ్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. పలు సందర్భాల్లో భద్రత లేకపోవడంతో చేపపిల్లలు దొంగతనాలకు గురవుతున్నాయి.

నివేదిక పంపాం... త్వరలోనే పరిష్కారమవుతుంది

పీఏబీఆర్ మత్స్యక్షేత్రానికి సంబంధించి పాండ్ల సమస్య ఉంది. ఇందుకు సంబంధించిన నివేదికలు తయారు చేసి రాష్ట్ర అధికారులకు పంపాం. వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్‌లోపు ఈ సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించి బడ్జెట్‌ను కేటాయిస్తే, పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నాం.

- శ్రీనివాస్, డీడీ, మత్స్యశాఖ

పంటలు కాపాడే ప్రయత్నం

కృష్ణ జింకల నియంత్రణకు చర్యలు

క్షేత్రస్థాయిలో పరిశీలించిన డీఎఫ్ఓ

రైతుల్లో చిగురిస్తున్న ఆశలు..



రైతులతో మాట్లాడుతున్న డీఎఫ్ఓ (ఫైల్)

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో సాగు చేసిన పంటలను కృష్ణ జింకల నుంచి కాపాడుకోవడం రైతులకు సవాల్‌గా మారింది. రైతుల విన్నపం మేరకు అటవీ అధికారులు చర్యలు చేపట్టారు. వర్షాధారం మీద ఆధారపడి జిల్లాలోని వజ్రకరూర్, విడపనకల్ మండలాల్లో రైతులు వివిధ పంటలు సాగు చేస్తారు. అయితే వర్షాలు సకాలంలో కురవకపోవడంతో పంటలు ఆశించిన మేరకు చేతికి రావడం లేదు. అయినా స్థానిక రైతులు కనీసం 50 శాతమైనా చేతికందకుండా పోతుందా అనే ఆశతో వేల ఎకరాల్లో ప్రతి యేటా పంటలు సాగు చేస్తున్నారు. అయితే మొలక దశలోనే కృష్ణ జింకలు గుంపులుగా పొలాలపై దాడులు చేసి మొలక దశలోనే తినేస్తున్నాయి. వాటి పంటలను కాపాడుకోవడం రైతులకు సవాల్‌గా మారింది. దీంతో ఆయా మండలాలకు చెందిన పలువురు రైతులు ఈ నెల 9వ తేదీన జిల్లా కేంద్రానికి వచ్చి జిల్లా అధికారుల కు వినతి పత్రాలు సమర్పించారు. కృష్ణ జింకల నుంచి త మ పంటలను కాపాడాలని విన్నవించారు. అందులో భాగం గానే జిల్లా అటవీశాఖ కార్యాలయంలో జిల్లా అటవీశాఖా ధికారి విఘ్నేష్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. పదేళ్లుగా తమ గో డు చెప్పుకుంటున్నా, పరిష్కారం దొరకలేదని వాపోయారు. పదేళ్ల క్రితం వందల సంఖ్యలో ఉన్న కృష్ణ జింకలు క్రమేణా వేల సంఖ్యకు చేరాయి. వాటిని అదుపు చేసి, పంటలను కాపాడుకోవడం చాలా ఇబ్బందికరంగా ఉందని తెలిపారు. దీనిపై స్పందించిన డీఎఫ్ఓ మంగళవారం క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లారు. రైతులతో సమస్యపై ఆరా తీశారు. కృష్ణ జింకల దాడిలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ముందుగా డ్రోన్ ద్వారా పరిశీలించి క్రిష్ణ జింకల సంఖ్యను అంచనా వేసేందుకు నిర్ణయించినట్లు డీఎఫ్ఓ పేర్కొన్నారు. అనంతరం ప్రారంభ చర్యల్లో భాగంగా ఉన్న వాటి సంఖ్య వృద్ధి చెందకుండా తగిన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. త మ విన్నపాన్ని మన్నించి డీఎఫ్ఓ క్షేత్రస్థాయి పర్యట నకు వెళ్లడంతో స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నా రు.

క్షేత్రస్థాయి తనిఖీతో అవగాహన వచ్చింది



స్థానిక రైతులు కార్యాలయానికి వచ్చి వారి సమస్యను విన్నవించారు. దీంతో సమస్య ఎంత ఇబ్బందికరంగా ఉందో అర్థమైంది. సమస్య తీవ్రతను గమనించి వెంటనే క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాం. అక్కడ సమస్య చాలా ఇబ్బందికరంగా ఉంది. ఇప్పటికిప్పుడు పరిష్కరించలేమ ని అర్థమైంది. అయితే అవి మరింత వృద్ధి చెందకుండా , మరో సమస్య తలెత్తకుండా వెంటనే చర్యలు చేపట్టేలా ప్రణాళిక తయారుచేస్తున్నాం. వీలైనంత త్వరగా రైతుల కు న్యాయం జరిగేలా చూస్తాం.

- విఘ్నేష్, జిల్లా అటవీశాఖ అధికారి



కేక్ కట్ చేస్తున్న ఎంపీ అంబికా, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఇతర నాయకులు

టీడీపీ కార్యాలయంలో

సెమీ క్రిస్మస్ వేడుకలు

అనంతపురం అర్బన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం సాయంత్రం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచెపు వెంకటేష్, మీడియా కో ఆర్డినేటర్ కూచి హరి, తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వప్న తదితరులు కేక్ కట్ చేసి సెమీ క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. జిల్లాలోని క్రిస్టియన్లకు ఎంపీ అంబికా, పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు లింగారెడ్డి, మణికంఠబాబు, కురబ నారాయణ స్వామి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వినియోగదారుల చట్టంపై

అవగాహన అవసరం

ఇన్‌చార్జి కలెక్టరు శివనారాయణశర్మ



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న శివనారాయణశర్మ

అనంతపురం టౌన్, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): వినియోగదారుల చట్టంపై అందరికీ అవగాహన అవసరమని ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని మంగళవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖలద్వారా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఇన్‌చార్జి కలెక్టర్ సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినియోగదారుల సంక్షేమం, హక్కులపై అవగాహన కల్పించడం కోసమే జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ చట్టం ద్వారా మోసపోయిన వినియోగదారులకు సత్వర న్యాయం సాధ్యమన్నారు. అనంతరం వినియోగదారుల చట్టంపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలను ఇన్‌చార్జి కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో డీఎస్ఓ వెంకటేశ్వర్లు, జిల్లా కన్స్యూమర్ కమిషన్ ప్రెసిడెంట్ శ్రీలత, లీగల్‌మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ సుధాకర్, డీఈఓ ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

చేతులెత్తేసిన ఆంధ్ర బ్యాటర్లు

ఆరు వికెట్లు తీసిన మహారాష్ట్ర బౌలర్ సుభం



సుభంకాదం

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బీసీసీఐ కూచ్‌బెహార్ అండర్-19 టోర్నీలో ఆంధ్ర బ్యాటర్లు చేతులెత్తేశారు. మహారాష్ట్ర బౌలర్ సుభంకాదం ఆరు వికెట్లు తీయడంతో ఆంధ్రజట్టు 143 పరుగులకే ఆలౌట్ అయ్యింది. ఆంధ్ర, మహారాష్ట్ర జట్ల మధ్య క్వార్టర్ ఫైనల్ ఆర్డీటీ స్టేడియంలో మంగళవారం మూడవ రోజు కొనసాగింది. ఓవర్‌నైట్ స్కోర్ 3 వికెట్లు కోల్పోయి 69 పరుగులతో మూడో రోజు ఆంధ్ర జట్టు ఆటను ప్రారంభించింది. సుభంకాదం ధాటికి 143పరుగులకే ఆలౌట్ అయ్యింది. బ్యాటర్లు వరుణ్ సాత్విక్ 50, లోహిత్ లక్ష్మీనారాయణ 28 పరుగులు చేశారు. రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన మహారాష్ట్ర జట్టు ఆటముగిసే సమయానికి 58 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 173 పరుగులు చేసింది. ప్రస్తుతానికి మహారాష్ట్ర 450 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. సుస్రుత్ సావంత్ 56పరుగులు చేసి నాటౌట్‌గా నిలిశాడు. ఆంధ్ర బౌలర్లలో యువన్ 2, రాజేష్ వికెట్ తీశారు. ఒక్కరోజు ఆటమాత్రమే మిగిలి వుండటంతో మ్యాచ్ డ్రాగా ముగిసే అవకాశం కనిపిస్తోంది. బీసీసీఐ సెలెక్టర్ హర్విందర్‌సింగ్ సోధి, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఏజీఎం శివకుమార్, మహారాష్ట్ర సెలెక్షన్ కమిటీ ఛైర్మన్ మిలింద్‌గుంజాల్, క్రికెట్ సంఘం జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి భీమలింగారెడ్డి తదితరులు పోటీలను పర్యవేక్షించారు.

జయప్రదం చేయండి

అనంతపురం కల్చరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): వేమన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పద్యపోటీలను జయప్రదం చేయాలని ఆ ఫౌండేషన్ కార్యదర్శి అప్పిరెడ్డి హరినాథరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలోని వేమన ఫౌండేషన్ కార్యాలయంలో పద్యపోటీల పోస్టర్లను ఎస్కేయూ విశ్రాంత వీసీ కాడా రామకృష్ణారెడ్డి అధ్యక్షతన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అప్పిరెడ్డి హరినాథరెడ్డి మాట్లాడుతూ 100 పాఠశాలల్లో పద్యపోటీలు నిర్వహించడం జరుగుతోందన్నారు. ఆసక్తి ఉన్న పాఠశాలల యాజమాన్యాలు ఈ నెలాఖరులోపు 9963917187 నెంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. జనవరి 9వ తేదీలోపు పాఠశాలస్థాయిలో పద్యపోటీలు నిర్వహించి, విజేతలకు మెడల్స్, ప్రశంసాపత్రాలు, వేమన పుస్తకాలను బహుమతులుగా అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వేమన ఫౌండేషన్ సభ్యులు మనోహర్‌రెడ్డి, లోకన్న, జలీల్ అహ్మద్, వన్నూర్ సాబ్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అదృశ్యాలు.. ఆత్మహత్యలు

● ఉమ్మడి జిల్లాలో విషాద ఘటనలు

ఉమ్మడి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాలలో నలుగురు అదృశ్యమయ్యారు. కొన్ని అదృశ్యాలు పోలీసు కేసులవరకూ వెళ్లాయి. మరికొన్ని మౌఖిక ఫిర్యాదులకు పరిమితమయ్యాయి. వేర్వేరు కారణాలతో ఐదుగురు ఆత్మహత్య చేసుకున్నారు. వీరిలో ఒక రైతు ఉన్నారు.

అప్పుల బాధతో యువ రైతు..


కార్తీక్

కళ్యాణదుర్గం రూరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండలం బాల వెంకటాపురం గ్రామానికి చెందిన యువ రైతు బ్యాళ్ల కార్తీక్ (23) అప్పుల బాధతో మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. కార్తీక్ తండ్రి వెంకటేశులు 14 సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. అప్పటి నుంచి తమ పది ఎకరాల పొలంలో కార్తీక్ వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పొలంలో బొప్పాయి, టమోటా సాగు చేశాడు. పంటల సాగుకోసం బ్యాంకులో రూ.4 లక్షలు, వడ్డీ వ్యాపారుల వద్ద రూ.7 లక్షలు అప్పు చేశాడు. దిగుబడులు సరిగా రాక నష్టపోయాడు. అప్పులు తీర్చే మార్గంలేక ఇంట్లో తన లుంగీతో ఉరి వేసుకున్నాడు. తల్లి ఇందిరమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో లారీ డ్రైవర్..


మృతిచెందిన అశోక్‌కుమార్

పామిడి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చైతన్య కాలనీకి చెందిన పల్లపు అశోక్ కుమార్(37) అనారోగ్య సమస్యలతో మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. అశోక్ కుమార్ లారీ డ్రైవర్‌గా పనిచేసేవాడు. ఇటీవల షుగర్, ఆస్తమాతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గుర్తుతెలియని వ్యక్తి..

గుంతకల్లు టౌన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు-గూళ్లపాళ్యం రైలు మార్గంలో వివేకానంద ఎంబీఏ కళాశాల సమీపంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని గుంతకల్లు జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర తెలిపారు. మృతుడికి 30 సంవత్సరాలు వయసు ఉంటుందని, ఉరవకొండ నుంచి గుంతకల్లుకు తీసుకున్న బస్సు టిక్కెట్ ఉందని తెలిపారు. ఇతర ఆధారాలు లభించలేదని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంకొక్కరు..

గుత్తి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): గుత్తి జీఆర్పీ పరిధిలోని తురకపల్లి - రామరాజుపల్లి రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెందారని రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు. మృతుడి వయసు 45 సంవత్సరాలు ఉంటుందని, అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. ప్రమాదవశాత్తు రైల్లో నుంచి జారీ పడ్డాడా, లేక ఆత్మహత్య చేసుకున్నాడా తెలియాల్సి ఉందని అన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

మనవరాలు కనిపించలేదని..

గుత్తి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వక్కలకుంట ప్రాంతంలో నివాసముంటున్న లక్ష్మీదేవి(65) అనే వృద్ధురాలు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఇంటి పైకప్పుకు ఉరివేసుకుందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మనవరాలు కనిపించకుండా వెళ్లిపోవడంతో ఈ అఘాయిత్యానికి పాల్పడిందని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాలికను తీసుకువెళ్లినా..

పుట్లూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): బాలికను తీసుకువెళ్లిన యువకుడిపై కేసు నమోదు కాకుండా వైసీపీ నాయకుడు ఒకరు చక్రం తిప్పారని సమాచారం. ఓ గ్రామానికి చెందిన బాలికను రెండు రోజుల క్రితం ఓ యువకుడు తీసుకువెళ్లాడు. దీంతో బాలిక తల్లిదండ్రులు తాడిపత్రి డీఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. రెండురోజుల అనంతరం పోలీసులు ఇద్దరినీ గుర్తించి పుట్లూరు పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. యువకుడి తరపున వైసీపీ నాయకుడు వకాల్తా పుచ్చుకుని, కేసు లేకుండా చేసినట్లు తెలిసింది. ఈ విషయం తన దృష్టికి వచ్చిందని, కానీ బాలిక తల్లిదండ్రులు ఇంతవరకూ ఫిర్యాదు చేయలేదని డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థిని అదృశ్యం

అనంతపురం క్రైం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): నగరంలో ఓ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని పరీక్ష రాయడానికి వెళ్లి అదృశ్యమైంది. దీనిపై అనంతపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శ్రీ సత్యసాయి జిల్లా సోమందేపల్లికి చెందిన లిఖిత నగర శివారులోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. అక్కడే హాస్టల్‌లో ఉంటోంది. మరో కాలేజీ సెంటర్‌లో బుధవారం పరీక్ష రాయడానికి వచ్చి అదృశ్యమైంది. కళాశాలకు వెళ్లకపోవడంతో యాజమాన్యం తల్లిదండ్రులకు సమాచారం అందించింది. దీంతో లిఖిత తల్లి యశోద ఫిర్యాదు చేశారని రూరల్ పోలీసులు తెలిపారు.

ప్రేమ వివాదం..

బత్తలపల్లి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా పులివెందులకు చెందిన శివప్రసాద్ (24) బత్తలపల్లిలో అదృశ్యమయ్యాడు. శివప్రసాద్ తండ్రి రామాంజనేయులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బత్తలపల్లిలోని తన అక్క, బావ వద్దకు శివప్రసాద్ వచ్చాడు. ఇదే ఊరిలో తమ బంధువుల అమ్మాయిని శివప్రసాద్ ప్రేమించాడు. దీంతో యువతి తరఫువారు గొడవపడ్డారు. అప్పటి నుంచి శివప్రసాద్ అదృశ్యమయ్యాడు. దీంతో యువకుని తండ్రి రామజినేయులు మంగళవారం తమకు ఫిర్యదు చేశారని ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా.. వ్యక్తి మృతి

గుంతకల్లు టౌన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాతకొత్తచెరువు గ్రామ సమీపంలో మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ మంగళవారం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పాతకొత్తచెరువు గ్రామానికి చెందిన బి. శేషానందరెడ్డి(28) మృతి చెందారు. సొంత ట్రాక్టర్‌లో గ్రామ శివారులో మట్టిని తరలించేందుకు శేషానందరెడ్డి వెళ్లారు. మట్టిని లోడ్ చేసుకుని వస్తుండగా అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య చంద్రకళ, మూడు సంవత్సరాల ఒక కుమారుడు ఉన్నాడు. కసాపురం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గోడకూలి.. కూలీ..

కదిరి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజీవ్‌గాంధీ నగర్‌లో గోడ కూలి గంగులప్ప(48) అనే కూలీ మృతిచెందాడు. చలమకుంట్లపల్లికి చెందిన గంగులప్ప పాత ఇల్లు కూల్చే పనికి వచ్చాడు. ఇల్లు కూల్చేసమయంలో గోడ గంగులప్ప మీద పడింది. శకలాల కింద ఊపిరాడక మృతిచెందాడు.

ప్చ..!



కందిని దెబ్బకొట్టిన వరుస తుఫాన్లు

● పైర్లు పెరిగినా.. ప్రయోజనం శూన్యం
● రాలిపోయిన పూత ● దిగుబడిపై తీవ్ర ప్రభావం


నంబులపూలకుంట మండలంలో ఏపుగా పెరిగిన కంది పైరు

కదిరి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): వరుస తుఫాన్లు కంది పంటను తీవ్రంగా దెబ్బకొట్టాయి. కందిపంట సాగుచేసిన రైతులు దిగుబడిపై దిగాలుగా ఉన్నారు. ఈసారి కూడా కంది పంట పోయిందని మదనపడుతున్నారు. ప్రధాన పంట వేరుశనగపై ఆధార పడకుండా కందిని ఈసారి ఎక్కువ మంది సాగుచేశారు. నెల క్రితం వరకు పంట ఆశాజనకంగా ఉండేది. నవంబరు, డిసెంబరు నెలల్లో వరుస తుఫాన్లు రావడంతో కంది పంట దిగుబడిపై రైతన్నలు దిగులు పెట్టుకున్నారు. కంది సాగుకు ఖర్చు కూడా తక్కువ కావడంతోపాటు గిట్టుబాటు ధర కూడా దక్కుతుండడంతో రైతులు కంది సాగుపై ఆసక్తి చూపుతున్నట్లు తెలిసింది.

కంది పోయింది..

కంది పంట సాగుకు జిల్లాలో రైతులు మక్కువ చూపుతున్నారు. ప్రధాన పంట వేరుశనగ తరువాత కందిపంటనే ఎక్కువమంది సాగు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా కంది పంటను 49,061 మంది రైతులు 92,750 ఎకరాల్లో సాగుచేసినట్లు వ్యవసాయాధికారుల లెక్కలు చెబుతున్నాయి. రొద్దం మండలంలో అత్యధికంగా 18,367 ఎకరాల్లో సాగుచేశారు. కదిరి వ్యవసాయ డివిజన్‌లో దాదాపు 10 వేల ఎకరాల్లో పంట పెట్టారు. నవంబరు నుంచి కంది పూత రావడం మొదలైంది. ఇదే సమయంలో నెలపాటు తుఫాన్ల ప్రభావంతో పూత రాలిపోయింది. ముఖ్యంగా కదిరి డివిజన్‌లో కందిపంటపై తుఫాన్ల ప్రభావం ఎక్కువగా ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. రెండు, మూడు రోజులు ఎడతెరిపి లేకుండా వర్షం పడడంతో పూత రాలిపోయినట్లు రైతులు చెబుతున్నారు. ఇది దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు అంటున్నారు. కంది పంట ఏపుగా పెరిగిందే తప్ప.. దిగుబడి అంతంత మాత్రంగానే ఉందని చెబుతున్నారు. గింజ పట్టిన కంది తక్కువగా ఉన్నట్లు చెబుతున్నారు.

దిగుబడిపై తీవ్ర ప్రభావం

కంది పంటకు అనుకూల వాతావరణం అంటే ఎటువంటి వర్షాలు లేకుండా ఉండడమే. ముఖ్యంగా పూత సమయంలో వర్షం పడకూడదు. వర్షానికి పూత రాలిపోయే ప్రమాదం ఉంది. సాధారణంగా ఎకరాకు కనీసం 8 క్వింటాళ్ల వరకు దిగుబడి ఉంటుంది. ప్రస్తుతం వరుస తుఫాన్లతో రెండు నుంచి మూడు క్వింటాళ్ల వరకు మాత్రం దిగుబడి రావచ్చని రైతులు వాపోతున్నారు. పెట్టుబడి కూడా రాదని చెబుతున్నారు. ఇలా అయితే మళ్లీ అప్పులపాలేనని ఆవేదన చెందుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

కంది పంట సాగుచేసి తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. పంటల బీమా పథకంలో కంది ఉన్నప్పటికీ కొన్ని మండలాల్లో వరుసగా వర్తిస్తోందని రైతులు చెబుతున్నారు. కంది పంట సాగుచేసి నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులు వచ్చే ఖరీఫ్ పంటలు సాగుచేయడానికి సబ్సిడీలు అందించాలని కోరతున్నారు.

ఒక్క కాయ కూడా లేదు



నాలుగెకరాల్లో కంది సాగుచేశా. పూత దశలో మేఘాలు కమ్ముకోవడంతో పూత పూర్తిగా రాలిపోయింది. ఎండ కాసిన రెండురోజులకే మొగ్గలు రావడం, తరువాత మబ్బులు రాగానే పూత రాలిపోతోంది. వాతావరణ పరిస్థితులవల కారణంగా పూత, కాయాలేదు. సంక్రాంతికి కోత కోయాల్సి ఉండగా, ఒక్క కాయ కూడాలేదు. రూ.50వేలు నష్టపోయా

- మదారాబాషా, ధనియాన్‌చెరువు, ఎన్పీకుంట

40శాతం పూతపోయినా దిగుబడి తగ్గదు

కందిలో పూత రాలడం సహజం. వరుస తుఫాన్ల ప్రభావంతో కంది పూత రాలిపోయింది. 40 శాతం పూత రాలిపోయినా దిగుబడికి ఇబ్బంది ఉండదు. పూత రాలకుండా గతంలో రైతులకు మందులు సూచించాం. కాయగా ఏర్పడడానికి కొంతమంది రైతులు మందులు కొట్టారు. ప్రస్తుత దశలో ఎటువంటి మందులు అవసరం లేదు. దిగుబడిపై రైతులు దిగులు పడాల్సిన అవసరం లేదు.

- సత్యనారాయణ, వ్యవసాయశాఖ ఏడీ

ఆర్టీసీ ఉద్యోగుల..
ఆనందం..!

● రాత్రి భత్యం అమలుకు ప్రభుత్వం నిర్ణయం
● నైట్ సర్వీసులకు వెళ్లేవారికి ఉపయోగకరం


ధర్మవరం ఆర్టీసీ బస్టాండ్

ధర్మవరం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో రాత్రి వేళల్లో విధులు నిర్వహించే ఉద్యోగులకు భత్యం మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం రాత్రి భత్యాన్ని ఆపేసి, అన్యాయం చేసింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన ఆరు నెలల్లోనే రాత్రి భత్యాన్ని ఇచ్చేందుకు ముందుకు రావడం పట్ల ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ హయాంలో మొదట్లో ఆరునెలలపాటు రాత్రి భత్యం ఇచ్చారు. ఆ తరువాత డ్రైవర్లు, కండక్టర్లు ప్రభుత్వ ఉద్యోగులని జీఓ తీసుకొచ్చారు. దీంతో రాత్రి భత్యం రద్దు చేశారు. దీనిపై సంఘాలు పలురూపాల్లో ఆందోళనలు చేపట్టాయి. యూనియన్ల ఆధ్వర్యంలో గేటుమీటింగులు, ధర్నాలు, ప్రజాప్రతినిధులకు వినతులు అందజేశారు. అయినా.. ప్రయోజనం లేదు. వైసీపీ ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాత్రి భత్యం ఇవ్వాలని సంఘాల నుంచి వినతులు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో రాత్రి భత్యం మంజూరు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ఆర్టీసీ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అదనపు ఆదాయం

జిల్లాలో ధర్మవరం, పుట్టపర్తి, హిందూపురం, పెనుకొండ, కదిరి, మడకశిర పట్టణాల్లో మొత్తం 6 ఆర్టీసీ డిపోలున్నాయి. వీటి పరిధిలో దాదాపు 2వేల మంది కండక్టర్లు, డ్రైవర్లు విధులు నిర్వహిస్తున్నారు. ఈ డిపోల్లో రాత్రివేళల్లో విధులకు వెళ్లేవారు దాదాపు 150 మంది ఉన్నారు. వీరికి నిబంధనల ప్రకారం నెలవారీ జీతంతోపాటు రాత్రి విధులకు వెళ్లిన రోజున అదనంగా భత్యం (అలవెన్స్) దూరాన్ని రూ.150 నుంచి రూ.400 వరకు చెల్లిస్తారు. ఒక్కో డిపోలో 30 నుంచి 50 బస్సు సర్వీసులు రాత్రి వేళల్లో సుదూర ప్రాంతాలైన హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూరు, శ్రీశైలం, నెల్లూరు వంటి నగరాలతోపాటు జిల్లాలో ఆయా గ్రామాలకు వెళ్తుంటాయి. ఆ సర్వీసులకు వెళ్లే ఉద్యోగులకు నెలకు రూ.4వేల నుంచి రూ.6వేలదాకా రాత్రి భత్యం అందనుంది.

కష్టాలను గుర్తించిన ప్రభుత్వం



ఆర్టీసీలో గతంలో రాత్రి భత్యం ఇచ్చేవారు. గత వైసీపీ ప్రభుత్వం దానిని రద్దు చేసింది. దీంతో నైట్ సర్వీసు విధులకు వెళ్లే సిబ్బంది నెలకు దాదాపు రూ.4వేలు రాత్రి భత్యం కోల్పోయేవారు. కూటమి ప్రభుత్వం రాత్రి భత్యం మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం అభినందనీయం.

- తిరుమలేశు, ఈయూ డిపో అధ్యక్షుడు, ధర్మవరం

పోరాట ఫలితమే



ఆర్టీసీలో రాత్రిపూట విధులు నిర్వహించే ఉద్యోగులకు అలవెన్స్ ఇవ్వాలని కొంతకాలంగా పోరాటాలు చేస్తున్నాం. వాటి ఫలితంగా కూటమి ప్రభుత్వం స్పందించి రాత్రి భత్యం మంజూరు చేయడం హర్షణీయం.

- ప్రభాకర్, ఎన్ఎంయూ డిపో అధ్యక్షుడు, ధర్మవరం

వాతావరణ అనుకూల వ్యవసాయం అమలు చేయండి

● అధికారులకు ఇన్‌చార్జ్ కలెక్టర్ ఆదేశం

అనంతపురం టౌన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వాతావరణ అనుకూల వ్యవసాయ కార్యక్రమా న్ని పక్కాగా అమలు చేయాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం ఈ- వ్యవసాయంపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. రైతులు నష్టపోకుండా వాతావరణానికి అనుగుణంగా వ్యవసాయం, పంటలు సాగు చేస్తే బాగుంటుందని ఆర్డీటీ ఎకాలజీ సంస్థ సూచించిందన్నారు. ఇందులో జిల్లాలో పది గ్రామాలను ఎంపిక చేసి అక్కడ వాతావరణ అనుకూల వ్యవసాయ కార్యక్రమం అమలుకు ప్రతిపాదించామన్నారు. ఆయా గ్రామాల్లో అందరు అధికారులు సమన్వయంతో ఈ - వ్యవసాయాన్ని పక్కాగా అమలు చేయాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ సూచించారు. ఇది భవిష్యత్తులో ఇతర గ్రామాల్లో రైతులు పాటించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయాధికారి జేడీ ఉమామహేశ్వర మ్మ, ఉద్యానశాఖ డీడీ నరసింహారావు, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, పశుసంవర్ధకశాఖ ఏడీ శ్రీలక్ష్మి, నాబార్డు డీడీఎం అనూరాధ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టరు శివనారాయణ్‌శర్మ

ఆకలి తీరుస్తున్న అన్నదాత..!

● ఆరేళ్లుగా బాటసారులకు నిత్యాన్నదానం



తనకల్లు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆరేళ్లుగా నిత్యాన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్న ఓ అన్నదాత అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు. చిన్నసాయం చేసినా గొప్పలు చెప్పుకుంటున్న నేటి సమాజంలో.. ఎక్కడా తనపేరుకానీ, ఫొటోకానీ లేకుండా, ఎవరు అన్నదానం చేస్తున్నారో తెలియకుండా నిత్యాన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తూ.. బాటసారుల ఆకలి తీరుస్తున్నాడు. తనకల్లు మండలంలోని మరాలపల్లి వద్ద 2018 సంవత్సరంలో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ఆ గ్రామానికి చెందిన బళ్లాపురం ధనుంజయ ప్రారంభించారు. గ్రామం వద్ద కొక్కంటిక్రాస్, అమడగూరు రహదారిలో రోడ్డు పక్కన మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు ఎవరు వచ్చినా అన్నం లేదనకుండా వడ్డించేవారు. అక్కడే షెల్టర్ నిర్మాణం చేపడతామని ముందుకు రావడంతో భూ యజమానులు అడ్డుతగిలారు. దీంతో గ్రామం అటువైపున తమ సొంత భూమిలో శాశ్వత షెడ్ నిర్మాణం చేట్టారు. అక్కడే బాటసారులకు నిత్యం అన్నదానం నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ వందమందికి తక్కువ కాకుండా బాటసారులు, కియా పరిశ్రమకు వెళ్లే వాహనచోదకులు, అక్కడి నుంచి చెన్నై వెళ్ల వాహనచోదకులు, పశువుల కాపర్లు, బాటసారులు, ఉద్యోగులు, ఎవరైనా సరే ఆ సయంలో వెళ్లి భోజనం చేయవచ్చు. అన్నంతోపాటు రాగిముద్ద నిత్యం అందుబాటులో ఉంటాయి. బాటసారులకు భోజనం వండి వడ్డించడానికి దాతలు ఎవరి వద్ద సాయం అడగకుండా కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నారు. బాటసారులకు అన్నం వండి వడ్డించడానికి ముగ్గురు వ్యక్తులను నియమించుకున్నారు. ఒక్కొక్కరికి రూ.7వేల వేతనం చెల్లిస్తూ గత ఆరేళ్లుగా అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఎప్పుడూ తాను చేస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని గురించి ప్రచారం చేసుకోలేదు. వంటకు కావలసిన అన్నిరకాల కూరగాయలు, బియ్యం, సామగ్రిని తామే సమకూర్చుతున్నారు. వర్షం వచ్చినా, పండగరోజైనా అన్నదానం కొనసాగుతూనే ఉంటుంది. ఆరేళ్లుగా నిత్యాన్నదానం చేస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్న ధనుంజయను బాటసారులు కొనియాడుతున్నారు.


ధనుంజయ దంపతులు


బాటసారులకు భోజనం

ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం

● మంత్రి సత్యకుమార్ యాదవ్
● ధర్మవరంలో డయాలసిస్ కేంద్రం ప్రారంభం


డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్

ధర్మవరం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యమని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. స్థానిక పోతుకుంట రోడ్డులోని మాతాశిశు సంక్షేమ ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్‌ను మంత్రి మంగళవారం ప్రారంభించారు. డయాలసిస్‌కు సంబంధించిన గదులు, పరికరాలను అక్కడున్న వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 50కిపైగా డయాలసిస్ సెంటర్లున్నాయన్నారు. గతంలో డయాలసిస్ కోసం చాలాదూరం వెళ్లాల్సి వచ్చేదన్నారు. తద్వారా రోగులపై అదనపు భారం పడేదన్నారు. దూరప్రాంతాలకు వెళ్లడానికి ఇబ్బంది పడేవారన్నారు. ప్రస్తుతం డయాలసిస్ కేంద్రాలను పెంచడం ద్వారా బాధితుల కష్టాలు తీరుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఏపీ సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, టీడీపీ పట్టణాధ్యక్షుడు పరిశే సుధాకర్, డయాలసిస్ స్టేట్ మోడల్ ఆఫీసర్ నిర్మల గౌరి, జిల్లా వైద్యాధికారి ఫైరోజా బేగం, డీసీహెచ్ఎస్ తిప్పేంద్రనాయక్ పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 118 మంది ఎంపిక


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ఎస్కేయూ వీసీ, రిజిస్ట్రార్

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వివిధ సంస్థల్లో పనిచేసేందుకు 118మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఎస్కేయూ, ఏపీఎస్ఎస్‌డీసీ, సీడ్యాక్, ఎంప్లాయిమెంట్ డిపార్ట్‌మెంట్ సంయుక్తాధ్వర్యంలో మంగళవారం మెగా జాబ్‌మేళాను నిర్వహించారు. ఎస్కేయూ పాలిమర్ సైన్స్ సెమినార్ హాల్లో నిర్వహించిన జాబ్‌మేళాను ముఖ్య అతిథులుగా హాజరైన వీసీ ప్రొఫెసర్ అనిత, రెక్టార్ ప్రొఫెసర్ వెంకట నాయుడు, రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ అనిత మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆకాంక్షను నెరవేర్చేలా జాబ్‌మేళాలను నిర్వహించి విద్యార్థులకు ఉద్యోగాలు కల్పిస్తున్నామన్నారు. చదువుతో పాటు ఉద్యోగ మెలకులపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. రెవ్యూటెక్‌కు 40 మంది, క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ్‌కు 30, ఐసన్ టెక్నాలజీకి 35, టీసీఎస్‌కు 13మంది చొప్పున మొత్తం 118మంది విద్యార్థులకు ఎంపికవడం హర్షణీయమని తెలిపారు. అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

ఇంకెన్నాళ్లీ ఇక్కట్లు..?

• అధ్వానంగా గ్రామీణ రహదారులు • ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోని వైనం



ఓబుళదేవరచెరువు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): గ్రామీణ రహదారులు చాలా అధ్వానంగా ఉన్నాయి. మండలంలోని ఉగ్గిరెడ్డిపల్లి, వెంకటాపురం, బండకిందపల్లి రహదారులే ఇందుకు నిదర్శనం. 20 ఏళ్ల క్రితం నిర్మించిన ఉగ్గిరెడ్డిపల్లిలో రోడ్డు ప్రస్తుతం ఘోరంగా తయారైంది. అత్యవసర సమయంలో 108లో రోగులు, గర్భవతులు వెళ్లాలన్నా ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెల కొంది. అయినా దెబ్బతిన్న రోడ్లపై గత్యంతరం లేక గ్రామీణులు ప్రయాణం కొనసాగించాల్సి వస్తోంది. ఇదే పరిస్థితిలో కదిరి-వెంకటాపురం రోడ్డూ ఉంది. ఐదేళ్ల వైసీపీ పాలనలో రహదారుల గురించి ఏ మాత్రం పట్టించుకోలేదు. కనీసం కూటమి ప్రభుత్వం అయినా మరమ్మతులు చేపట్టాలని గ్రామీణులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

• పట్టించుకోని అధికారులు

ఏళ్లు గడుస్తున్నా శిథిలమైన రోడ్లపై ప్రయాణం చేయాల్సి వస్తోందని ఉగ్గిరెడ్డిపల్లి, వెంకటాపురం పంచాయతీ ప్రజలు వాపోతున్నారు. ఉగ్గిరెడ్డిపల్లి రోడ్డుకు మరమ్మతులు చేయాలని పంచాయతీ రాజ్ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందన్నారు. కదిరి-హిందూపురం ప్రధాన రోడ్డు పక్క నారప్పగారిపల్లి నుంచి కరక మాను తోపు వరకు ఉన్న రోడ్డు కూడా అధ్వానంగా తయారైంది. రాత్రి సమయంలో వాహనదారులు ఆదమరిస్తే మాత్రం ప్రమాదమే. ఇటీవల అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి.

• ఐదేళ్లుగా నిర్లక్ష్యం

ఐదేళ్ల వైసీపీ పాలనలో రోడ్లు మరమ్మతులకు నోచుకోకపోవడంతో రోడ్లు మరింత అధ్వానంగా తయారయ్యాయి. 20 నిమిషాలు పట్టే ప్రయాణం... రెట్టింపు అవుతోంది. ఆయా గ్రామాల ప్రజలు గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. మూడేళ్ల క్రితం వెంకటాపురం పంచాయతీ, బండకిందపల్లి రోడ్డుకు కంకర వేశారు. నేటికి తార్ వేయకపోవడంతో కంకరపైనే ప్రజలు ప్రయాణం చేయాల్సిన దుస్థితి ఉంది.

↓ అధ్వానంగా ఉన్న ఉగ్గిరెడ్డిపల్లి రోడ్డు →



నరకం చూస్తున్నాం



అనేక సంవత్సరాలుగా రోడ్లు బాగలేక పోవడంతో వాటిపై ప్రయాణిస్తూ నరకం అనుభవిస్తున్నాం. అత్యవసర సమయాలల్లో రోగులు, గర్భవతులను 108లో తీసుకెళ్లాలంటే గుంతలు ఎక్కువగా ఉండడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రాత్రి సమయంలో ద్విచక్రవాహనంలో వెళ్లాలంటే ఆచితూచి వెళ్లాల్సి వస్తోంది. ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా ప్రమాదాలు జరుగుతున్నాయ్.

-రవీంద్రారెడ్డి, ఉగ్గిరెడ్డిపల్లి

మరమ్మతులు చేపట్టాలి



ఐదేళ్ల వైసీపీ పాలనలో రోడ్లు మరమ్మతులు ఏమాత్రం జరగలేదు. దీంతో గత్యంతరం లేక ఎగుడు దిగుడు రోడ్లపైనే ప్రయాణం చేస్తున్నాం. రోడ్లు మరమ్మతు చేయిం చాలని పంచాయతీ రాజ్ ఉన్నాధికారులను కోరాం. కూటమి ప్రభుత్వమైనా గ్రామీణ రోడ్లకు మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకోవాలి.

-కృష్ణమూర్తి, ఉగ్గిరెడ్డిపల్లి

న్యూస్ బాక్స్..

పశుగణన సర్వే తనిఖీ

నల్లమాడ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్వహిస్తున్న పశు గణన సర్వేను రెడ్డిపల్లి పశువైద్యాధికారి రవినాయక్ మంగళవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. పశు గణనను ప్రతి ఇంటికి తిరిగి వివరాలు సేకరించి, ప్రభుత్వం నిర్దేశించిన యాప్‌లో నమోదు చేయాలన్నారు. నవంబరు 25 నుంచి 2025 ఫిబ్రవరి 28వరకు ఈ సర్వే జరుగుతుందన్నారు. సర్వేకు వచ్చిన సిబ్బందికి రైతులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ఉన్నారు.

మసీదు నిర్మాణానికి విరాళం



రూ. రెండులక్షల చెక్కును అందిస్తున్న మస్తాన్‌వలీ

తనకల్లు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండవెనుకపల్లిలో మసీదు నిర్మాణానికి కోర్తికోట మాజీ సర్పంచ్, సీనియర్ టీడీపీ నాయకుడు ఎస్‌కె మస్తాన్‌వలీ రూ.రెండు లక్షల విరాళాన్ని అందించారు. మండలంలోని ముతవలీ, ఇమామ్‌లు, మౌజన్లుకు ఆ చెక్కును మంగళవారం ఆయన కోరారు.

వాల్మీకి బోయ సంఘాల ఏర్పాటు



మాట్లాడుతున్న సంఘం నాయకుడు బంగారు క్రిష్ణమూర్తి

కదిరి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వాల్మీకిబోయ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో జిల్లా, మండల కమిటీలు ఏర్పాటు చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బంగారు క్రిష్ణమూర్తి ఎన్నికైన వారికి నియామక పత్రాలు అందించారు. బోయలను ఎస్టీ జాబితాలో చేర్చేంతవరకు ప్రతి ఒకరు సమష్టిగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కుర్లపల్లి మోహన్, బూదిలి ధనుంజయ్, మేకల శివప్రసాద్, వీరనారప్పం, మల్లెం అశోక్, చిన్న నరసింహులు, ప్రహ్లాదా, భాస్కర్, ఆంజనేయులు, శ్రీనివాసులు, చలపతి, శంకర్, ఆది, శ్రీకాంత్, రామాంజనేయులు పాల్గొన్నారు.

తాడిమర్రికి నీరందించండి

తాడిమర్రి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యంత తీవ్ర కరువు మండలాల్లో తాడిమర్రి ఒకటని, ఈ మండలంలోని అన్ని చెరువులకూ పీఏబీఆర్ కుడికాలువ ద్వారా నీరు అందించాలని మంత్రి సత్యకుమార్‌యాదవ్ అధికారులను ఆదేశించారు. పిన్నదరి గ్రామం నుంచి తిరిగి వస్తూ మంత్రి పీఏబీఆర్ కుడికాలువపై పర్యటించారు. పీఏబీఆర్ ఈఈ బసవరాజుతో మాట్లాడుతూ... ఈ మండలానికి వీలైనన్ని చెరువులకు కుడికా లువ ద్వారా నీరందించాలని, ఏవైనా ఇబ్బందులుంటే ఉన్నతాధికారులతో మాట్లాడతానని మంత్రి తెలిపారు. అనంతరం పీఏబీఆర్ కాలువకు సంబంధించిన ఉన్నతాధి కారులతో ఫోన్‌లో మాట్లాడుతూ బత్తలపల్లి, తాడిమర్రి మండలాలకు నీరు ఎక్కువగా ఇచ్చే ఏర్పాట్లు చేయాలన్నారు.


జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులతో నాయకులు

బుక్కపట్నం, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వం బాలుర పాఠశాల ఆవరణంలో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలను మంగళవారం ప్రారంభించారు. ఈ పోటీల్లో జిల్లా నుంచి దాదాపు 30 జట్లు పాల్గొన్నారు. వీటిలో 10 జట్లు రెండో రౌండ్‌కు చేరుకున్నాయి. ఈ పోటీలను డైట్ కళాశాల పీడీ రామక్రిష్ణ, టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, బుక్కపట్నం సర్పంచ్ నాగలక్ష్మీరాజు, మాజీ సర్పంచ్ సాకే యశోద, మండల కన్వీనర్ చింతా మల్లిరెడ్డి, గోపాలపురం గంగాధర్ ప్రారంభించారు. బుధవారం ఫైనల్ పోటీలను జరుగుతాయని నిర్వాహకులు జగదీష్, దిలీప్, దేవ, సాయి తెలిపారు.

అక్రమ బోరుకు విద్యుత్ కనెక్షన్ తొలగింపు



చెరువులో అక్రమంగా వేసిన బోరు

గాండ్లపెంట, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని చామాలగొంది పంచాయతీలోని పోతులవాండ్లపల్లి గ్రామం వద్ద అయ్యప్పకుంటలో అక్రమంగా వేసిన బోరుకు విద్యుత్ కనెక్షన్ తొలగించినట్లు కురమామిడి వీఆర్‌ఓ చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. అయ్యప్పకుంటలో ఓ రైతులు అక్రమంగా బోరు వేయడంతో పాటు ఎకరా చెరువు భూమిని ఆక్రమించినట్లు గ్రామస్థులు తహసీల్దార్ బాబురావుకు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ ఆదేశాల మేరకు బోరును పరిశీలించి, విద్యుత్ కనెక్షన్ తొలగించామని వీఆర్‌ఓ తెలిపారు.

ఎస్‌ఐని నియమించండి



ఖాళీగా ఉన్న ఎస్‌ఐ కుర్చీ

గాండ్లపెంట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పోలీస్ స్టేషన్‌కు ఎస్‌ఐను నియమించాలని ప్రజలు కోరుతున్నారు. మండలంలో 14 పంచాయతీలు, వందకుపైగ్రామాలున్నాయని, వివిధ సమస్యలపైన పలువురు ప్రజలు స్టేషన్‌కు వస్తున్నారని, ఎస్‌ఐ పోస్ట్ ఖాళీగా ఉండ టంతో ఆ సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు పడుతు న్నారని వాపోతున్నారు. ఈనెల 9న ఇస్కాక్‌బాషా ఇక్కడ ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టారని, అయితే ఆయన రెండు రోజుల్లోనే మళ్లీ బదిలీపై వెళ్లిపోయారని తెలిపారు. ఎస్‌ఐ లేకపోవడంతో నేరుగా కదిరి రూరల్ సీఐకి సమస్యలు విన్నవించడానికి ప్రజలు వెళ్తున్నారన్నారు.

పాఠశాలల్లో క్రిస్మస్ వేడుకలు

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్ : ధర్మవరం సమీపంలోని కాకతీయ పాఠశా లలో క్రిస్మస్ పండుగ సందర్భంగా వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు శాంతాక్లాజ్, మేరిమాత వేషధారణలో పలువురిని అలరింపచేశాయి. విద్యార్థుల నృత్యాలు, గానాలు నాటిక ప్రదర్శన ఆకట్టుకున్నాయి. అదేవిధంగా నాగలూరు వద్ద గల పాఠ శాలలో క్రిస్మస్ వేడుకలు విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. అలాగే ఓబుళదేవరచెరువు లోని జ్ఞానసాయి, వశిష్ట పాఠశాలల్లో మంగళవారం సెమి క్రిస్‌మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఓబుళదేవరచెరువులోని సీఅండ్‌ఐజీ మిషన్ చర్చితో పాటు పలు చర్చిలను సుందరంగా అలంకరించారు. అలాగే ముదిగుబ్బలోని పీవీఎస్ పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు శాంతాక్లాజ్ వేషధారణలో అలరించారు.



ఓడీసీలోని వశిష్ట ఇంగ్లీష్ మీడియం స్కూల్లో...



ధర్మవరం కాకతీయ పాఠశాలలో..



ముదిగుబ్బ : పీవీఎస్ పాఠశాలలో..

పర్యాటక రంగానికి ప్రాధాన్యం: కలెక్టర్

పుట్టపర్తి టౌన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): సత్యసాయి జిల్లాలో పర్యాటక రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. మంగళవారం పుట్టపర్తి మండలంలోని అమ్మగొండ్యపాళ్యం అటవీ ప్రాంతంలో జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న నగర వనాన్ని కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. టూరిజం అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అందులో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యంలో రిజర్వు ఫారెస్టులో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడానికి నగరవనాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు. పర్యావరణం పట్ల ప్రజలకు అవగాహనతో పాటు, ఆహ్లాదాన్ని ఇవ్వడానికి అటవీ ప్రాంతాలతో ఈటూరిజం ఏకో పార్కును ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన నగర వనాన్ని క్షుణంగా పరిశీలించి, పర్యాటకుల భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అటవీశాఖా ధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. జిల్లాలోని పలు దర్శనీయ స్థలాలను కూడా పర్యాటకప్రాంతాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట జిల్లా అటవీశాఖాధికారి చక్రపాణి, బుక్కపట్నం రైయింజ్ అధికారి యామినిసరస్వతి ఉన్నారు.



నగరవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పశువులకు వ్యాక్సిన్లు వేయించండి

నంబులపూలకుంట, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పశువులకు సోకే సీజనల్ వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన వ్యాక్సిన్లు వేయించాలని పశు వైద్యాధికారి బాలు నాయక్ సూచించారు. మంగళవారం స్థానికంగా నిర్వహించిన పొలం పొలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయన గేదెలు, పశువులను పరిశీలించారు. గొర్రెలకు వచ్చే బొబ్బవ్యాధి నివారణకు షిప్‌పాక్స్ వ్యాక్సిన్, సరక వ్యాధి నివారణకు టీపీఆర్ వ్యాక్సిన్ వేయించాలన్నారు. కోళ్ల పెంపకంలో కొక్కర వ్యాధి నివారణకు వ్యాక్సినేషన్ వేయించాలని సూచించారు. ఏఓ లోకేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కంది పంటను సాగుచేసిన రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కంది పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. రబీలో సాగుచేసిన వేరుశనగ, వరి పంటను రైతులు నెలాఖరులోపు పంట బీమా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం మౌనిక, రైతు సేవా కేంద్రం సిబ్బంది ధనలక్ష్మీ, యుగంధర్ పాల్గొన్నారు.



పాడి ఆవును పరిశీలిస్తున్న పశువైద్యాధికారి

కుణుతూరులో త్రీఫేస్ విద్యుత్ సరఫరా

అట్టహాసంగా ప్రారంభించిన మంత్రి సత్యకుమార్

ధర్మవరం రూరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుణుతూరు గ్రామంలో ఫీడర్‌కు 24 గంటలు త్రిఫేస్ విద్యుత్ సరఫరా అందించే కార్యక్రమాన్ని మంగళవారం మంత్రి సత్యకుమార్ అట్టహాసంగా ప్రారంభించారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కుణుతూరు వేణుగోపాల్‌రెడ్డితో కలిసి మంత్రి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తంతో ఆర్‌డీఎస్‌ఎస్ పథకం ద్వారా రూ. 1.85 కోట్లతో దీన్ని ఏర్పాటు చేశారు. మంత్రి మాట్లాడుతూ గ్రామాల్లో 24 గంటలు విద్యుత్ సరఫరా వల్ల పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందవచ్చున్నారు. ఈ త్రిఫేస్ విద్యుత్ సరఫరా పథకం కుణుతూరు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. అభివృద్ధికి ఇదో ఒక అడుగు అని అభివర్ణించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మాజీ జడ్పీ చైర్మన్ చిగిచెర్ల ఓబిరెడ్డి, నాయకులు మహేష్‌చౌదరి, కమతం కాటమయ్య, మాజీ ఎంపీపీ మద్దిలేటి, అధికారులు పాల్గొన్నారు.

• సూర్యఘర్‌పై అవగాహన

ధర్మవరం : స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజనపై అవగాహన కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్‌యాదవ్ పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ... సూర్యఘర్ ద్వారా అతి తక్కువ విద్యుత్ బిల్లు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ మహేశ్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, జిల్లా బీజేపీ అధ్యక్షుడు జీఎంశేఖర్, టీడీపీ నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జ్ చింతలపల్లి మహేశ్ చౌదరి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

• పరామర్శ

తాడిమర్రి : మండలంలోని పిన్నదరి గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ విశ్వనాథ్ తల్లి చెన్నమ్మ ఆదివారం మరణించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళవారం ఆ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట అనంతపురం జిల్లా బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, మండల టీడీపీ కన్వీనర్ కూచిరాము, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గోనుగుంట్లభూషణ్ ఉన్నారు.



ధర్మవరం : సూర్యఘర్ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి

వైసీపీ వాళ్లను బీజేపీలో చేర్చుకోకండి సార్

ధర్మవరం రూరల్: 'సార్ గత ఐదేళ్లు వైసీపీ వాళ్లతో ఇబ్బందులు పడ్డాం.. అవమానాలు భరించాం. కేసులు పెట్టించుకున్నాం.. వాటిని తట్టుకొని మీ గెలుపు కోసం మేమంతా అహర్నిశలు శ్రమించాం.. మీ గెలుపు కోసం చాలా కష్టపడ్డాం. లక్షలు ఖర్చు పెట్టుకున్నాం.. మిమ్మల్ని గెలిపించుకున్నాం. ఇప్పుడే ఆ వైసీపీ వాళ్లు అధికారం కోసం బీజేపీలో చేరుతున్నారు. అలాంటి నాయకులను బీజేపీలో చేర్చుకోకండి సార్..' అని పోతుకుంటకు చెందిన టీడీపీ నాయకులు మంత్రిని కోరారు. మంగళవారం మండలంలోని పోతుకుంట గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు సర్పంచ్ అంగజాల నాగవేణి భర్త అంగజాల రాజు మంత్రిని అనంతపురంలో కలిశారు. త్వరలో బీజేపీలో చేరుతానని మంత్రికి చెప్పారు. అనంతరం మంత్రి వెంట కుణుతూరులో జరిగే కార్యక్రమానికి అంగజాల రాజు వచ్చాడు. అక్కడే ఉన్న పోతుకుంటకు చెందిన టీడీపీ నాయకులు తలారి వెంకటలక్ష్మీ, పోతలయ్య, హరి, రవి, ఆది మంత్రి వద్దకు నేరుగా వెళ్లి తమ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై మంత్రి, టీడీపీ నాయకులు మాట్లాడుతూ.. దీనిపై మళ్లీ మాట్లాడుకుందామని వారి నచ్చజెప్పారు.

క్రైం న్యూస్ ....

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



వడ్డే రామన్న(ఫైల్)

కొత్తచెరువు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ కాలనీకి చెందిన వడ్డెరామన్న (69)ను ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో మరణించాడు. మంగళవారం ఆయన స్థానిక నాలుగు రోడ్ల కూడలి నుంచి నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా పుట్టపర్తి వైపు నుంచి బైక్‌పై వచ్చిన షబ్బీర్ ఢీకొన్నాడు. ఆయన తలకు తీవ్ర గాయం కావడంతో స్థానికులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. రామన్నకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

ద్విచక్రవాహనానికి నిప్పు



కొత్తచెరువు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక వైఎస్ఆర్‌కాలనీలో నివాసముంటున్న మట్టిప్రసాద్‌కు చెందిన ద్విచక్రవాహనానికి గుర్తుతెలియని దుండగులు సోమవారం రాత్రి నిప్పుపెట్టారు. దీంతో ద్విచక్రవాహనం పూర్తిగా దగ్ధమైంది. రూ.65 వేలు నష్టం జరిగిందని బాధితుడు తెలిపారు. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పాడు.

కేసు నమోదు

కదిరి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అడపాల వీధి లైట్ హౌస్ సమీపంలో నివాసముంటున్న వడ్డారపు గంగాధర్ ఇంటిలోకి అక్రమంగా ప్రవేశించిన రమేష్‌నాయక్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి మంగళవారం తెలిపారు. సోమవారం రాత్రి 11గంటల సమయంలో గంగాధర్ ఇంటిలో ఉండగా రమేష్‌నాయక్ ప్రహరీ దూకి ఇంటిలోకి వచ్చాడని, గంగాధర్ గట్టిగా అరవడంతో పారిపోయినట్లు చెప్పారు. గంగాధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రమేష్‌నాయక్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వైసీపీ కార్యకర్తపై ఫిర్యాదు



ఎస్‌ఐకి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

బుక్కపట్నం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రమ్మపల్లికి చెందిన మహేష్ అనే వైసీపీ కార్యకర్త సోషియల్ మీడియా వేదికగా టీడీపీ నాయకులు, కార్యకర్తలపై అనుచిత వ్యాఖ్యలు చేశాడు. 'వచ్చేది జగనన్న ప్రభుత్వమే.. అప్పుడు టీడీపీ నాయకు లు, కార్యకర్తలను వేటాడి నరుకుతాం..' అని సోషియల్ మీడియాలో బెదిరించాడు. ఈ విషయంపై మంగళవారం మండల టీడీసీ నాయకులు ఎస్‌ఐ క్రిష్ణమూర్తికి ఫిర్యాదు చేశారు. మహేష్‌పై చర్యలు తీసుకోవాలని వారు ఫిర్యాదులో తెలిపారు.

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

కొత్తచెరువు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో వినియో గదారుల దినోత్సవం సందర్భంగా నిర్వహిం చిన వ్యాసరచన, వకృత్వపు పోటీల్లో జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో రాణించారు. పుట్టపర్తి మండలం బీడిపల్లి జిల్లా పరిష త్ ఉన్నత పాఠశాల విద్యార్థి జన్నత్, తలుపుల మండలం ఓబిరె డ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి క్రాంతి నగదు బహు మతి, ప్రసంశాపత్రాన్ని అందుకున్నట్లు జిల్లా సైన్స్ విభాగపు అధి కారి తనూజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కొక్కరికి రూ.3 వేలు నగదు, ప్రశంసాపత్రం, మెమొంటోను అందజేశారన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి రథోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో బుధవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ రామసూరారెడ్డి తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్లుప్తంగా..

ఘనంగా వాజ్‌పేయి శతజయంతి



బహుమతులు అందుకున్న విద్యార్థులు

పరిగి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): భారతరత్న అటల్‌బిహారీ వాజ్‌పేయి శతజయంతి సందర్భంగా మంగళవారం సేవామందిరంలోని ఎన్‌లైట్ డిగ్రీ కళాశాలలో వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో దాదాపు 158మంది విద్యార్థులు పాల్గొనగా, మొదటి బహుమతిని తస్లింబాను, రెండో బహుమతిని పార్థు, తృతీయ బహుమతిని హిమబిందు అందుకున్నారు. వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు బంగారు చంద్ర, ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి, కళాశాల కరస్పాండెంట్ సురేష్, ఫైడిశెట్టి, వెంకట్, నాగేశ్వరి, బీజేపీ నాయకులు బాబుప్రసాద్, రామాంజినేయులు, చంద్ర, వెంకటేశ్ పాల్గొన్నారు.

మంగాపురంలో పెద్దమ్మ జాతర



పెద్దమ్మకు జ్యోతులు సమర్పిస్తున్న మహిళలు

పెనుకొండ రూరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగాపురంలో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా పెద్దమ్మకు జాతర మహోత్సవం నిర్వహించారు. ఏడాదిక్రితం గ్రామస్థుల సహకారంతో పెద్దమ్మ ఆలయాన్ని నిర్మించారు. ఏటా ఆనవాయితీ ప్రకారం ఆంజనేయ స్వామికి మొదటగా జ్యోతులు సమర్పించారు. అనంతరం మంగళవారం పెద్దమ్మకు ప్రతి ఇంటి నుంచి మహిళలు జ్యోతులు సమర్పించారు.

అధునాతన యంత్రాలతో వరి కోతలు

పెనుకొండ రూరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రబీసీజన్‌లో సాగుచేసిన వరిపంటను నూర్పిడి చేసేందుకు రైతులు యంత్రాలను ఉపయోగిస్తున్నారు. మండల వ్యాప్తంగా రబీసీజన్‌లో వ్యవసాయ బోరుబావుల కింద 300హెక్టార్లకు పైగా వరి సాగుచేశారు. వరిపంట కోసేందుకు కూలీ ధరలు అధికంగా ఉండటంతో రైతులు ఆధునిక యంత్రాలపై దృష్టిసారించారు. ఆధునిక యంత్రాలు గంటకు రూ.4వేలు చొప్పున వరిచేను నూర్పిడి చేసి ఒకచోట గింజలు పోస్తున్నాయి. దీంతో రైతులకు సులభంగా మారిందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గర్భవతులకు అన్నదానం

సోమందేపల్లి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): సోమందేపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం గర్భిణులు, బాలింతలకు తొగటవీరక్షత్రియ సేవా సమితి అధ్యక్షుడు సీసీ హరి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఆసుపత్రికి వచ్చే వారికి పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశ్యంతో తన తండ్రి జ్ఞాపకార్థం కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు హరికుమార్, ఓంకార్, టీడీపీ నాయకులు, చేనేతలు పాల్గొన్నారు.

సాగు భూములకు హక్కులు కల్పించండి

సోమందేపల్లి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): గత 35సంవత్సరాల నుంచి 28వ సర్వే నంబరులో సాగుచేసుకుంటున్న వెనుకబడిన వర్గాలకు చెందిన అసైన్డ్ భూములకు హక్కులను కల్పించాలని రైతులు కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశులు ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. మంగళవారం తుంగోడు గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో వారు అర్జీలను తహసీల్దార్ రెడ్డిశేఖర్‌కు సమర్పించారు. వారు మాట్లాడుతూ హక్కుపత్రాలు లేనందున భూస్వాములు రాజకీయ నాయకులతో కలిసి తమ భూములను అన్యాక్రాంతం చేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి పట్టాలను అందించాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ పదిరోజుల్లో పరిష్కారాన్ని చూపుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు అంజినమ్మ, సరస్వతి, బాబు, అశ్వర్థరెడ్డి, ఓబులరెడ్డి, ఓబులమ్మ, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాలువ మరమ్మతులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న టీడీపీ నాయకులు

సోమందేపల్లి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ మరమ్మతు పనులకు మంగళవారం సీనియర్ టీడీపీ నాయకులు వెంకటేశ్వర్‌రావు భూమిపూజచేసి పనులు ప్రారంభించారు. రైతుల పొలాలకు నీరందించి హిందూపురానికి మంచినీరు అందించడానికి బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ చొరవతో రూ.1.20కోట్లు మంజూరైనట్లు తెలిపారు. సోమందేపల్లి నుంచి హిందూపురం వరకు కాలువను పునరుద్ధరించి గండి పడిన చోట మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నీరుగంటి చంద్ర, టౌన్ కన్వీనర్ నూరి, మద్దిలేటి పాల్గొన్నారు.

నియోజకవర్గ కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు పుల్లయ్య

మడకశిరటౌన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మడకశిర నియోజకవర్గ ఏపీడబ్ల్యూజే నూతన కమిటీని మంగళవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఏపీడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు పుల్లయ్య, కార్యదర్శి బాబు, చంద్రశేఖర్ సమక్షంలో కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రామాంజనేయులు, గౌరవాధ్యక్షులుగా శ్రీనివాసులు, ముఖ్య సలహాదారులుగా శంకర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, త్రిలోక్, ఉపాధ్యక్షులుగా ఇర్ఫాన్, కృష్ణారెడ్డి, పవన్‌కుమార్, హనుమంతరాయప్ప, షబ్బీర్, ప్రధాన కార్యదర్శిగా హనుమంతరావు, కార్యదర్శిగా శివన్న, సంయుక్త కార్యదర్శులుగా శివాచారి, నాగరాజు, నగేష్‌ను ఎన్నుకొన్నారు.

శుభోదయం.. నేడు క్రీస్తు జన్మదినం


హిందూపురం, మడకశిర, పెనుకొండలలో బుధవారం జరిగే క్రిస్మస్ వేడుకలకు ప్రార్థనా మందిరాలు ముస్తాబయ్యాయి. మిరుమిట్లు గొలుపే విద్యుత్ దీపాలతో చర్చిలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. భవనాలు రకరకాల స్టార్లతో కొత్తశోభ సంతరించుకున్నాయి. క్రైస్తవులు క్రిస్మస్ పండుగను ఘనంగా జరుపుకునేందుకు ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు.



మడకశిర పట్టణంలోని సీఅండ్ఐజీ చర్చి



హిందూపురం జెరూసలేం సెంట్రల్ చర్చి



పెనుకొండలో ముస్తాబైన సీఅండ్ఐజీ చర్చి

రైతు ఆమరణ దీక్షకు మద్దతుగా ర్యాలీ

హిందూపురం అర్బన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి):దేశరాజధాని డిల్లీలో రైతు సమస్యలపై పోరాడుతూ ఆమరణ దీక్ష చేపడుతున్న రైతు సంఘాల నాయకుడు సర్దార్ జగ్జిత్‌సింగ్‌కు మద్దతుగా హిందూపురం ప్రజాసంఘాలు మంగళవారం క్యాండిల్ ర్యాలీ చేపట్టారు. డిల్లీలో చేపడుతున్న ఆమరణ దీక్షకు దేశవ్యాప్తంగా రైతులు ఆయనకు మద్దతు తెలుపుతూ క్యాండిల్ ర్యాలీ నిర్వహించారని ఇందులో భాగంగానే హిందూపురంలో కూడా నిర్వహించినట్లు ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు. పాఠశాలలు, కళాశాలలు, గ్రామాలు పట్టణాల్లో కూడా మద్దతు తెలిపారన్నారు. కేంద్ర ప్రభుత్వం నల్ల చట్టాలు తీసుకువచ్చి ఇప్పటికే దాదాపు 700 మంది రైతుల ప్రాణాలు బలి తీసుకుందని విమర్శించారు. దీంతో అప్పట్లో నల్ల చట్టాలను వెనక్కు తీసుకుంటున్నట్లు వాగ్దానం చేసి కూడా రైతుల డిమాండ్‌లు తీర్చలేదని దుయ్యబట్టారు. దీంతో సర్దార్ జగ్జిత్ సింగ్ ఆమరణ దీక్ష చేపట్టారన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు సోమశేఖర్‌రెడ్డి, చైతన్య గంగిరెడ్డి, టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఉమర్‌ఫరూక్, ఆర్సీపీ పార్టీ నాయకుడు శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు జమీల్, ఫయాజ్, వైఎసీపీ అమానుల్లా, కదిరీష్, ఎంఎస్‌ఎఫ్ రవి, భాస్కర్‌రెడ్డి, ఇబ్రహీం, మునవ్వీర్, బీఎస్పీ హరి, సిక్కురైతులు పల్వీందర్‌సింగ్, భగవాన్‌సింగ్, సత్పాల్‌సింగ్ ఉన్నారు.



చేతులెత్తి మద్దతు తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

మతగ్రంథాలతో సమానమైనది రాజ్యాంగం

హిందూపురం అర్బన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): భగవద్గీత, ఖురాన్, బైబిల్ గ్రంథాలతో సమానమైనది రాజ్యాంగమని దళిత, ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు. యావత్ భారతీయులందరూ గౌరవించే పవిత్ర గ్రంథం బాబాసాహెబ్ రచించిన మహోన్నత భారత రాజ్యాంగం అన్నారు. మన రాజ్యాంగాన్ని ప్రపంచ దేశాలన్నీ ఎంతగానో గౌరవిస్తాయన్నారు. అంబేద్కర్‌ను యావత్ ప్రపంచం అభినందిస్తుంటే చట్టసభలో అమిత్‌షా అవమానకరంగా మాట్లాడటం సభ్యసమాజాన్ని అగౌరవంగా మాట్లడటమే అని అలాంటి మంత్రిని పదవి నుంచి తొలగించాలన్నారు. పార్లమెంట్‌లో 80 మంది దాకా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఎంపీలు ఉండి కూడా అమిత్‌షా వాఖ్యలను ఖండించకపోవడం నిజంగా సిగ్గుచేటన్నారు. దీనిపై దేశవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమానికి చైతన్య గంగిరెడ్డి, ఎంఎస్‌ఎఫ్ రవి, టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఉమర్‌ఫరూక్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జెడ్పీ శ్రీనివాసులు, మూర్తి తదితరులు హాజరయ్యారు.

అదానీ కరెంటు కహానీ పుస్తకావిష్కరణ

పెనుకొండ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్థానిక పౌరసరఫరాల గోడౌన్‌వద్ద మంగళవారం అదానీ కరెంటు కహానీ పుస్తకాన్ని సీపీఎం నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు హరి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజలపట్ల కనీస బాధ్యతగా ఆలోచించకుండా కార్పొరేట్ సేవలకోసం తహతహలాడుతున్నాయన్నారు. అవినీతి ఒప్పందం గురించి లోటుపాట్లను ఈ పుస్తకం వెలుగులోకి తెచ్చిందన్నారు. ప్రజలను చైతన్యం కల్పించాల్సిన బాధ్యత ప్రజాస్వామ్యవాదులపై ఉందన్నారు. కార్యక్రమంలో సీఐటీయు జిల్లా కార్యదర్శి రమేష్, ఏపీ జిల్లా రైతు సంఘం సభ్యుడు ఫక్రుద్దీన్, బాబావలి, మహబూబ్‌బాష, ఆరీఫ్, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు

రైతులను మోసగిస్తున్న వారిపై చర్యలు



ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

పెనుకొండ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటల కొనుగోలులో వ్యాపారస్థులు తూకం ద్వారా మోసం చేస్తున్నారని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డీఓ ఆనంద్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. సోమవారం పరిగికి చెందిన రైతు రాజేష్ పండించిన పంటను వ్యాపారికి విక్రయిస్తుండగా తూకంలో మోసం చేశారన్నారు. 60కిలోల జొన్నల బస్తాకు 6కిలోలు తక్కువ వచ్చేలా స్కేల్ సిద్ధం చేసుకుని వచ్చారని దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. రైతులు వలస పోతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఇటువంటి వ్యాపారులు చేస్తున్న మోసాల ద్వారా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలన్నారు. తూకాల ద్వారా నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఫకృద్దీన్, సీఐటీయు నాయకులు రమేష్, నాగరాజు, బాబావలి పాల్గొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ



యూటీఎఫ్ స్వర్ణోత్సవ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

మడకశిరటౌన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జనవరి 5వతేదీ నుండి జరిగే యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం వైజ్ఞానిక స్వర్ణోత్సవ రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని జిల్లా గౌరవాధ్యక్షులు భూతన్న అన్నారు. పట్టణంలోని కె.పి.పాఠశాల ఆవరణంలో మంగళవారం వాల్‌పోస్టర్‌లను విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 8వతేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా కాకినాడ నగరంలో రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభలు జరగనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమానికి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షులు మహలింగప్ప, నాయకులు జోగప్ప, డి.నరసింహప్ప, నంజప్ప, దేవరాజ్, కదురన్న, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో రైతుకు అస్వస్థత

గోరంట్ల, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాపల్లికి చెందిన రైతు ఈరన్న మంగళవారం పాముకాటుకు గురై అస్వస్థతకు గురయ్యారు. ఈరన్న వరి పొలంలో పనిచేస్తుండగా కట్ల పాము కాటు వేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అస్వస్థతకు గురైన ఆయనను గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా, వైద్య చికిత్సలు అందించి, మెరుగైన వైద్యం కోసం 108లో పుట్టపర్తి ఆసుపత్రికి తరలించారు.

ఘనంగా జాతీయ వినియోగదారుల దినోత్సవం

పెనుకొండ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి) : స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కేశవరావు మాట్లాడుతూ వినియోగదారుల రక్షణ చట్టం ముఖ్య ఉద్దేశ్యం వివిధ రకాల దోపిడీకి వ్యతిరేకంగా వినియోగదారులకు రక్షణ కల్పించడమేనన్నారు. వినియోగదారులకు రక్షణ కల్పించడంలో 1986లో ఈ రక్షణ చట్టాన్ని రూపొందించారన్నారు. దీనిద్వారా వినియోగదారునికి ఉన్న హక్కులను వాణిజ్య విభాగ అధ్యాపకులు నారాయణ తెలిపారు. వాణిజ్యశాఖ రక్షణ పద్ధతులను ఆశాఖ అధ్యాపకులు చంద్రమోహన్ విద్యార్థులకు వివరించారు. వస్తువులను, సేవలను, కొనుగోలు చేసే ప్రక్రియలో వినియోగదారుడు పాటించాల్సిన ప్రామాణిక సూత్రాలను వివరించారు. కార్యక్రమంలో ఐక్యూ కోఆర్డినేటర్ శోభారాణి, అధ్యాపకులు హరి, రామన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

హోంగార్డులకు కనీస సౌకర్యాల కోసం డిమాండ్



మున్సిపల్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న హోంగార్డులు

పావగడ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుళ్లతో సమానంగా రాత్రింబవళ్లు సేవలు చేస్తున్న హోం గార్డులకు కనీస సౌకర్యాలు కల్పించాలని, హోంగార్డు కార్యాలయానికి స్థలాన్ని కేటాయించాలని మున్సిపల్ అధికారులకు మంగళ వారం వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం పాడుబడిన పాత భవనంలో హోం గార్డు సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. అత్యవసర సమయాల్లో పని నిమిత్తం ఇతర రాష్ట్రాల నుండి వచ్చినప్పుడు బస చేయడానికి కూడా అవకాశం లేదని, అలాంటి పరిస్థితుల్లో కార్యాలయం ఒకటి నిర్మిస్తే అన్ని విధాలా అనుకూలంగా ఉంటుందని వారు తెలియజేశారు. తుమకూరు రోడ్డులోని సాయిబాబానగర్‌లోని సాయిబాబా ఆలయం పార్కు స్థలంలో హోంగార్డు కార్యాలయానికి స్థలాన్ని కేటాయించాలని మున్సిపల్ అధికారి జాఫర్ షరీఫ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా హోంగార్డు సభ్యులు రాజేష్ హాజరై త్వరలోనే తమకు మేలుచేయాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

లేపాక్షి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి):చోళసముద్రం- హిందూపురం జాతీయ రహదారిలో కల్లూరు గ్రామంవద్ద మంగళవారం తెల్లవారుజామున మేళాపురం గ్రామానికి చెందిన నీరుగంటి అంజినప్ప (85) ఐచర్ వాహనం ఢీకొని మృతిచెందాడు. హిందూపురం మేళాపురం గ్రామానికి చెందిన నీరుగంటి అంజినప్పకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. చిన్నకుమార్తెకు పూలకుంటలో వివాహం జరిపించారు. కుమార్తెను చూడటానికి సోమవారం పూలకుంటకు వెళ్లిన అంజినప్పమంగళవారం తెల్లవారుజామున జాతీయరహదారిపై నడుచుకుంటూ తిరిగి వస్తుండగా మడకశిరవైపు నుంచి వస్తున్న ఐచర్ వాహనం ఆయనను ఢీకొంది. దీంతో ఆయన మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. అంజినప్ప కుమారుడు నరసింహప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ద్విచక్రవాహన ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన హరీష్

గోరంట్ల, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మయ్యగారిపల్లి సమీపంలోని ఉదయ్‌కిరణ్ పాఠశాలవద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో హరీష్ సోమవారం రాత్రి తీవ్రంగా గాయపడ్డారు. చిలమత్తూరు మండలం కమ్మయ్యగారిపల్లికి చెందిన హరీష్ గోరంట్లలోని చౌడేశ్వరీ కాలనీలో చేనేత మగ్గం నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు స్వగ్రామంనుంచి గోరంట్లకు వచ్చి విధులు ముగించుకుని తిరిగి వెళ్లేవారు. ఈ క్రమంలో మంగళవారం ఇంటికి తిరిగి వెళ్తూ గుమ్మయ్యగారిపల్లి వద్ద హైవే రోడ్డు ఫ్లైఓవర్ నిర్మాణం జరుగుతున్న చోట ద్విచక్రవాహనం బోల్తా పడడంతో తలకు బలమైన గాయమైంది. గాయపడిన అతడిని 108లో హిందూపురం ఆసుపత్రికి తరలించారు.

కారు, ట్రాక్టర్ ఢీ

మడకశిర రూరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని దిన్నేమిదపాళ్యం సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం కారు, ట్రాక్టర్ ఢీకొన్నాయి. కారును తప్పించపోయి ట్రాక్టర్ ఇంజన్ మాత్రమే బోల్తా పడడంతో పెద్దప్రమాదం తప్పిపోయింది. కారులో ఉన్న వారికి స్వల్ప గాయాలయ్యాయి.

గురుకుల విద్యార్థికి అరుదైన గౌరవం



రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికైన మహేంద్ర

లేపాక్షి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న చక్కజోగి మహేంద్రకు అరుదైన గౌరవం లభించినట్లు ప్రిన్సిపాల్ సుందర్‌రాజు తెలిపారు. 2025 రిపబ్లిక్ డే సందర్భంగా విద్యార్థి ఢిల్లీలో జరిగే యోగా, నృత్యంలో పాల్గొనడానికి అవకాశం లభించిందన్నారు. ఈ ప్రదర్శనకు ఎంపిక కావడం పాఠశాలకే గర్వకారణమన్నారు. జాతీయస్థాయిలో ప్రతిభ కనబరచి, పాఠశాలకు పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఘనంగా రథోత్సవం



పురవీధుల్లో సాగుతున్న రథోత్సవం

లేపాక్షి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కంచిసముద్రం గ్రామంలో వెలసిన గోందావళి సద్గురు బ్రహ్మ చైతన్యస్వామి రథోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై సీతారాముల విగ్రహాలను గోందావళి బ్రహ్మ చైతన్యస్వామి ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్ఠించి పురవీధుల్లో ఊరేగించారు. రథోత్సవ వేడుకలు తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. ఎటువంటి గొడవలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యం: జనసేన

మడకశిరటౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మడకశిర నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో జనసేన పార్టీ అభివృద్ధికి శాయశక్తుల కృషి చేద్దామని జనసేన ఉమ్మడి జిల్లా వాల్మీకి సంఘం రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి ధనుంజయ అన్నారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నియోజకవర్గం జనసేన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ మార్గదర్శనానికి అనుగుణంగా అందరూ పనిచేద్దామన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులకు అందేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జనసేన పార్టీ అభివృద్ధి పట్ల మండల స్థాయి నాయకులకు కమిటీ సభ్యులకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి ఆనంద్, నియోజకవర్గం సమన్వయకర్త రంగ స్వామి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

గుడిబండ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికే రెవిన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ కళ్యాణచక్రవర్తి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ముతుకూరు గ్రామంలో రెవిన్యూ రెవిన్యూ సదస్సును నిర్వహించారు.